జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | సోమవారం 23 మార్చి 2026 | సంపుటి: 19 | సంచిక: 14 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , చైత్ర మాసము , తిథిపంచమి - 18:40:52 వరకు నక్షత్రంకృతిక - 20:50:22 వరకు కరణంబవ - 07:59:22 వరకు, బాలవ - 18:40:52 వరకు పక్షంశుక్ల యోగంవిష్కుమ్భ - 12:21:26 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

### భారీగా పడిపోయిన బంగారం, వెండి ధరలు!

అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి ధరలు ఇటీవల గణనీయంగా పడిపోవడం పెట్టుబడిదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వెండి ధర దాని సర్వకాలిక గరిష్ఠ స్థాయి 121 డాలర్ల నుంచి సుమారు 45 శాతం తగ్గి 67 డాలర్ల వద్దకు చేరగా, బంగారం ధర కూడా

మిగతా1 2లో..

### పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ప్రధాని కీలక భేటీ

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై ప్రధాని నరేంద్ర మోదీ సీనియర్ మంత్రులతో చర్చించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్,

మిగతా 2లో..

## భద్రాద్రిని అద్భుతంగా అభివృద్ధి చేయాలి



### గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు చేయండి

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

### భద్రాచలం ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష

తెలంగాణలోని ప్రసిద్ధి సీతారామచంద్రుల ఆలయం భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం సమీక్ష చేసి అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయాలని.. గోదావరి పుష్కరాలకు కూడా భారీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆగమశాస్త్రం ప్రకారం అభివృద్ధి పనులు జరగాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉన్నతాధికారులతో భద్రాచలం ఆలయ అభివృద్ధి,

మిగతా 2లో..



# నాయకత్వంలో మార్పు చేసి చూడండి

**వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలోనూ కాంగ్రెస్ పార్టీ గెలవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. గెలిచిన కాంగ్రెస్ కు మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నూతనంగా నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రైతు భరోసా నిధులు తొలి విడతగా రూ.3,600 కోట్లు విడుదల చేశారు. అనంతరం సీఎం మాట్లాడారు.**

- సిద్దిపేటలో ఒక్క ఛాన్స్ ఇవ్వండి
- సిద్దిపేట నుండి గెలిస్తే మంత్రిని చేస్తాం..!
- ఈ ప్రాంత ప్రజలు చైతన్యవంతులు
- వచ్చే ఎన్నికల్లో విచక్షణతో ఆలోచించండి
- సిద్దిపేటకు నిధులు భారీగా ఇచ్చా .. ఇస్తా
- నర్మెట్ట బహిరంగసభలో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పర్యటన సందర్భంగా సిద్దిపేటకు మంత్రి పదవి ఆఫర్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామన్నారు. ఈ బాధ్యతను పెద్దలు దామోదర్ రాజనరసింహ, వివేక్ వెంకట స్వామి తీసుకుంటారని నేను ఈ వేదిక మీద నుంచి రేవంత్ మాటిచ్చారు. 2029 ఎన్నికలలో సిద్దిపేటలో గెలిచే కాంగ్రెస్ ఎమ్మెల్యేను వారు మంత్రిని చేస్తారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2014, 2018 సంవత్సరాల్లో కూడా మేము పోటీ పడ్డాం. ఆనాడు ప్రజలు మీకు (బీఆర్ఎస్ పార్టీకి) అధికారం ఇచ్చారు. కానీ 2023లో మీరు మేము పోటీ పడ్డప్పుడు ప్రజలు అధికారం మాకు ఇచ్చారు. అలాగే

మిగతా 12లో..

## రైతు భరోసా నిధులు విడుదల

### రైతు భరోసా కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం

### రూ. 9వేల కోట్ల రైతు భరోసా నిధుల విడుదల

### తొలి విడతగా రూ. 3,590 కోట్లు ఖాతాల్లో జమ




రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రారంభించింది. దీనికి సంబంధించిన నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ పథకం కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించనున్నారు. దీనికోసం రూ.9 వేల కోట్లను ప్రభుత్వం సమకూర్చుకుంది. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆదివారం జరిగిన సభలో ఉప ముఖ్యమంత్రి

మిగతా 12లో..



### భవన నిర్మాణ నిబంధనల్లో

## కీలక మార్పులు..

### టీడీఆర్ వినియోగంపై కొత్త మార్గదర్శకాలు జారీ

తెలంగాణలోని నిర్మాణ రంగంలో పారదర్శకత, క్రమబద్ధీకరణనే లక్ష్యంగా భవన నిర్మాణ నిబంధనల్లో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ టీడీఆర్ వినియోగంపై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. దీని ప్రకారం ఇకపై రాష్ట్రంలో 21 మీటర్లకు పైగా ఉన్న భవనాలు హై రైజ్‌గా పరిగణించనున్నట్లు పేర్కొంది. ఈ కొత్త రూల్స్ ప్రకారం.. 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణ కలిగిన ప్లాట్లలో అదనపు అంతస్తు నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అలాగే 40 ఫీట్ రోడ్ దగ్గర 3 అదనపు అంతస్తుల

మిగతా 2లో..

### అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా మోదీ

ప్రధాని మోదీ మరో అరుదైన రికార్డు



ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. మనదేశంలో సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వాధినేతగా వ్యవహరించిన రికార్డును ప్రధాని మోదీ ఆదివారం రోజు సొంతం చేసుకున్నారు. సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును మోదీ అధిగమించారు. సీఎంగా

మిగతా 2లో..

## శత్రువుదేశాలపై నిషేధం..

### మిత్ర దేశాలపై హర్మూజ్‌లో ఆంక్షలు లేవు

### ట్రంప్ హెచ్చరికపై ఇరాన్ అధ్యక్షుడు పేజేష్కియాన్

### ఇరాన్‌తో ఐరోపాకు ముప్పు: పేజేష్కియాన్



ఇరాన్‌ను ప్రపంచ పటం నుండి తుడిచివేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఆదివారం (మార్చి 22) నాడు స్పందించారు. 'మేం ఎవరి బెదిరింపులకు భయపడము. ఇరాన్‌ను పటం నుండి తుడిచి వేయాలనేది భ్రమ. చరిత్ర సృష్టించాలనుకుంటున్న అమెరికాకు ఇది నిరాశ కలిగిస్తుంది' అని అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

మిగతా 2లో..

### భారత్ ఫార్మా రంగంలో సరికొత్త విప్లవం!

**డయాబెటిస్, ఒబేసిటీ చికిత్స మరింత చవక!**

భారతీయ ఆరోగ్య రంగంలో ముఖ్యంగా డయాబెటిస్, ఒబేసిటీ చికిత్సలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అంతర్జాతీయంగా అత్యంత ఆదరణ పొందిన సెమాగ్లుటైడ్ ఔషధంపై డెన్మార్క్‌కు చెందిన నోవో నార్డిస్క్ సంస్థకు ఉన్న పేటెంట్ గడువు శుక్రవారం(మార్చి 20)తో ముగిసింది. ఈ గడువు ముగిసిన ముసటి రోజే భారతీయ ఫార్మా దిగ్గజాలు సన్ ఫార్మస్యూటికల్ ఇండస్ట్రీస్, జైడ్ లైఫ్ సైన్సెస్ తమ సొంత బ్రాండ్లను అత్యంత చౌక ధరకే మార్కెట్‌లోకి విడుదల చేశాయి. ఇది దేశంలోని లక్షల మందికి ఊరట ఇచ్చే అంశం. ప్రముఖ ఔషధ తయారీ సంస్థ సన్

మిగతా 12లో..

## మార్పు అనివార్యమే

### ఈ 25న కాంగ్రెస్‌కు జీవన్ రెడ్డి రాజీనామా..

### కాంగ్రెస్ పార్టీలో తాను కొనసాగలేనని వెల్లడి

### తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నానని ఆవేదన

### జగిత్యాలలో మారనున్న రాజకీయ ముఖచిత్రం



ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో అలుపెరగని నేతగా పేరున్న సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. గత 40 ఏళ్లుగా పార్టీ జెండాను మోసిన ఆయన, ఈ నెల 25న తన పదవికి, పార్టీ సభ్యత్వానికి స్వస్తి చెప్పబోతున్నట్లు జగిత్యాల కార్యకర్తలకు రాసిన లేఖలో పేర్కొన్నారు. గత 20 నెలలుగా పార్టీలో తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నానని, అవమానాలు భరిస్తూ కొనసాగలేనని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తన చిరకాల ప్రత్యర్థి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం,

మిగతా 2లో..

# సంపాదకీయం

## ప్రపంచం నెత్తిన చమురు సంక్షోభం !

చమురు ధరలు దారుణంగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా భారత్ సహా అనేక దేశాలు ఇంధన సమస్యలు ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచేశారు. సిలిండర్‌పై 80 రూపాయాలు పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేవలం గృహవినయోగ సిలిండర్లనే సరఫరా చేయాలని నిర్ణయించారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షలు విధించారు. కేవలం గృహావసరాలకే సరఫరా చేయాలని దేశాలు ఇచ్చారు. ఇకపోతే విదేశాల్లో సైతం కార్ల ఇంధన ధరలు పెరిగాయి. అమెరికాలోనూ గ్యాస్ ధరలతో అక్కడి వారు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నది. పది రోజులుగా వరుస దాడులు జరుగుతున్నాయి. ఇది ఇంకెంత కాలం సాగుతుందో చెప్పలేం. మర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు నౌకలు కదిలే పరిస్థితి లేదు. అందుకే యుద్ధంతో భారత్ చమురు దిగుమతులకు ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తున్నది. యూరప్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 20 డాలర్లు పెరిగి 80 డాలర్లకు చేరింది. హోర్మోజ్ జలసంధి కూడా మూతపడితే 100 డాలర్లకు కూడా చేరే ప్రమాదం పొంచి ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూయిజ్ కాలువ, ఎర్ర సముద్రం నౌకాయానా నికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడుతున్నది. ఈ మార్గాల్లో భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుంది. ఒకవేళ బ్యారెల్‌కు 10 డాలర్ల చొప్పున పెరిగితే, మొత్తం 15 బిలియన్ డాలర్ల అధిక వ్యయం అవుతుంది. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ఒపెక్ ఉత్పత్తిని పెంచవచ్చు. కానీ దీర్ఘకాలిక యుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు ఆర్థిక నష్టాలు, అమెరికా ప్రతిష్ఠకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధ వాతావరణంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తోపాటు పశ్చిమాసియాలోని ఆర్థిక వ్యవస్థలు, ప్రజల రోజువారీ జీవితాలను సంక్షోభం లోకి నెట్టేలా కనిపిస్తున్నది. ట్రంప్ మూర్ఖపు నిర్ణయం కారణంగా ప్రపంచం మొత్తం ఆర్థిక చక్రబంధంలో ఇరుక్కోవాలసి వస్తోంది. చమురు సరఫరా మార్గాల్లో అంతరాయల వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి, దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది. చమురు ధరలు పెరగడంతో వాల్‌స్ట్రీట్ 800 పాయింట్లు పడిపోయింది. పెట్రోల్, ఆహారం సహా అన్నింటి ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చమురు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అమెరికాకు దేశీయంగా చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం కొంత ఉపశమనం కావొచ్చు. కానీ ఇరాన్ బలాన్ని పట్టించుకోకపోతే ఇది ఇరాక్ యుద్ధంలా పెద్ద తప్పుగా మారే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం జరిగినా, రష్యా, చైనా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగినా అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యుద్ధం వల్ల జపాన్ వంటి ఆసియా దేశాలు అమెరికాపై నమ్మకం కోల్పోయి డాలర్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా– ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఇరాన్ చేస్తున్న ప్రతిదాడుల కారణంగానే ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇరాన్ తలొగ్గేది లేదని, లొంగిపోయేది లేదని తేల్చి చెప్పింది. ఇరాన్‌ను ధ్వంసం చేసే వరకు ట్రంప్ నిద్రపోయేలా కనిపించడం లేదు. ఇప్పటికే టర్కీ నుంచి దుబాయి వరకు అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు, పోర్టులు, చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా 27 ప్రాంతాలపై ఇరాను విరుచుకుపడింది. ఇవన్నీ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ల ద్వారానే జరిపినట్టు తెలిసింది. రవాణా మార్గాలపై ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియా కూడా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయాయి. ఇరాన్ వినియోగిస్తున్న ఆధునిక ఆయుధాలను దుబాయి, సౌదీ అరేబియా బలహీనమైన రక్షణ వ్యవస్థలు దీటుగా ఎదుర్కోలేకపోతున్నాయి. పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయి. దుబాయిలోని 50 లక్షల మంది భారతీయులపైనా ప్రభావం పడుతున్నది. ప్రస్తుత యుద్ధం కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్ కాలంలో రూపొందిం చిన పాత సరిహద్దులు కూడా మారిపోయే అవకాశం ఉన్నది. సంక్షోభంగా కారణంగా గల్ఫ్ రాజ్యాల్లో నిరుద్యోగం పెరిగితే ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తుతుంది. అమెరికా సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఇరాక్‌లో డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల పట్ల టర్కీ సంతోషం గానే ఉన్నదని కొందరు భావిస్తున్నారు. యుద్ధ వాతావరణంలో యూరప్ మాటలకే పరిమితమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. భారత్ చౌకైన రష్యా చమురుపై ఆధారపడుతున్నది. చైనా తన వాణిజ్య మార్గాలను, నౌకాశ్రయాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దాడుల కారణంగా ఇరాన్ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోయారు. ఇరాన్ సైనిక కేంద్రాలపై అమెరికా 1,700 దాడులు చేసింది. ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తున్నది. పర్షియన్ నాగరికతకు చెందిన దీర్ఘ చరిత్ర కారణంగా ప్రజలు ఐక్యంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆ దేశంలో పెద్దగా కల్లోలం కనిపించడంలేదు. రష్యా, చైనా మద్దతుతో యుద్ధం నిలువగలిగితే ప్రపంచానికి అది విజయం అవుతుంది.

## అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా మోదీ

మొదటిపేజీ తరువాయి..

8,930 రోజుల పాటు సేవలను అందించిన రికార్డు పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. మార్చి 22 (ఆదివారం) నాటికి గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రభుత్వాధినేత హోదాలలో నరేంద్ర మోదీ 8,931 పనిదినాలను పూర్తి చేసుకున్నారు. దీంతో పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు బద్దలైంది. దీర్ఘకాలం పాటు గుజరాత్ సీఎంగా వ్యవహరించిన రికార్డు నరేంద్రమోదీ పేరిట ఉంది. సీఎంగా సేవలు అందించే అవకాశం ఆయనకు నాలుగుసార్లు లభించింది. 2001 అక్టోబరు 7 నుంచి 2002 డిసెంబరు 22 వరకు, 2002 డిసెంబరు 22 నుంచి 2007 డిసెంబరు 22 వరకు, 2007 డిసెంబరు 23 నుంచి 2012 డిసెంబరు 20 వరకు, 2012 డిసెంబరు 20 నుంచి 2014 మే 22 వరకు నాలుగు దఫాలు ఆయన సీఎంగా వ్యవహరించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన తొలి ప్రధానమంత్రిగానూ మోదీ నిలిచారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘన విజయాల్లో మోదీ పాత్రే కీలకం. ప్రభుత్వాధినేత హోదాలో 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా 2025 అక్టోబరులో దేశ ప్రజలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు చెప్పారు. 2001లో గుజరాత్ సీఎంగా ప్రమాణం చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు, దేశ వికాసం కోసమే తాను పనిచేశానని ఆయన తెలిపారు. భీకర భూకంపం నుంచి గుజరాత్ రాష్ట్రం కొద్దికొద్దిగా కోలుకుంటున్న తరుణంలో తాను తొలిసారి గుజరాత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశానని, అది చాలాపెద్ద పరీక్షా కాలమని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆ సమయానికి గుజరాత్‌ను రాజకీయ అస్థిరత, సూపర్ సైక్లోన్ విపత్తు, దారుణమైన కరువులు కుదిపేశాయని చెప్పారు. ఈ సవాళ్లను చూసి, ఎలాగైనా గుజరాత్ రాష్ట్రాన్ని పునర్ నిర్మించాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నానని ఆయన తెలిపారు. కొత్త ఆశ, కొత్త శక్తితో సీఎంగా తొలి టర్మ్‌లో పనిచేశానని మోదీ పేర్కొన్నారు. పేదల కోసమే పనిచేయమని, ఎన్నడూ లంచం తీసుకోవద్దని తల్లి ఇచ్చిన సలహాలే తన ప్రజా జీవితానికి మార్గదర్శనాన్ని అందించాయని ప్రధాని మోదీ గతేడాది అక్టోబరులో తెలిపారు.

# శత్రువుదేశాలపై నిషేధం..

మొదటిపేజీ తరువాయి..

హర్మూజ్ జలసంధిపై చేసిన 48 గంటల అల్టిమేటం తర్వాత ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఘాటుగా స్పందించారు. ట్రంప్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్ షేర్ చేస్తూ, హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు బెదిరింపులతో పాటు అల్టిమేటం జారీ చేశారు.

ఇరాన్ వచ్చే 48 గంటల్లో, అంటే రెండు రోజుల్లో, ఎలాంటి షరతులు లేకుండా హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవకపోతే ఇరాన్ అణు విద్యుత్ కేంద్రాలపై అమెరికా భారీ బాంబు దాడి చేసి వాటిని పూర్తిగా నాశనం చేస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ అల్టిమేటం, హర్మూజ్ జలసంధి మూసివేయడంపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ స్పందించారు. 'హర్మూజ్ జలసంధి మా భూమి, హక్కులు, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే వారిని మినహాయించి మిగతా అందరికీ తెరిచే ఉంటుంది. మేం ఈ యుద్ధ రంగంలో ఎదురయ్యే అన్ని బెదిరింపులను ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. మమ్మల్ని వ్యతిరేకించని దేశాల ఓడలు, నౌకలు హర్మూజ్ నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నాయని' అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం తర్వాత, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ సహచరుడు ఇస్మాయిల్ సెక్బ ఇస్ఫహానీ ఆ ప్లాట్‌ఫారమ్‌లో ఒక పోస్ట్ చేశారు. దేశ ప్రజలను వచ్చే రెండు రోజుల్లో వారి కోసం నీటి నిల్వలను సేకరించి పెట్టుకోవాలని, వారి ఫోన్‌లను పూర్తిగా ఛార్జింగ్ చేసుకోవాలని సూచించారు. హర్మూజ్ జలసంధిపై ట్రంప్ ఒత్తిడి పెంచారని, వచ్చే 48 గంటల్లో అమెరికా లేదా ఇజ్రాయెల్ ఇరాన్ పవర్ ప్లాంట్లపై దాడులు చేస్తే, అది మొత్తం ప్రాంతంపై పెద్ద ప్రభావాన్ని చూపుతుందని ఆయన అన్నారు. ఇరాన్ ఇప్పటికైనా ఐరోపా దేశాలు మేల్కోవాలని ఆయన హెచ్చరించారు. ఆదివారం ఇరాన్ జరిపిన దాడుల్లో దెబ్బతిన్న 'అరాద్' ప్రాంతాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నెతన్యాహు మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌ను అడ్డుకోవడానికి ఇజ్రాయెల్,



చర్యలు కేవలం తమకే కాకుండా మొత్తం ప్రపంచానికి ముప్పుగా పరిణమించాయని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెన్యామిన్ నెతన్యాహు విమర్శించారు. ముఖ్యంగా ఐరోపా దేశాలకు ప్రత్యక్ష ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమెరికా–బ్రిటన్ సంయుక్త సైనిక స్థావరం 'డియెగో గార్సియా'పై ఇరాన్ ఖండాంతర క్షిపణిని ప్రయోగించిన నేపథ్యంలో నెతన్యాహు ఈ కామెంట్స్ చేసారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యం ఇప్పుడు ఐరోపా ఖండాన్ని నేరుగా తాకుతుందని, అమెరికా కలిసి పోరాడుతాయని చెప్పారు. గత 48 గంటల్లో ఇరాన్ విచక్షణారహితంగా దాడులు చేసిందని, తన అసలు స్వరూపాన్ని ప్రపంచానికి చూపించిందని నెతన్యాహు ఫైర్ అయ్యారు. ఇరాన్ ఉగ్రవాద పాలకులు పౌర నివాసాలనే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. చిన్న పిల్లల నర్సరీలు, వృద్ధాశ్రమలపై క్షిపణులను ప్రయోగించారని మండిపడ్డారు. పౌరులను చంపడమే లక్ష్యంగా నిషేధిత క్లస్టర్ బాంబులను ఇరాన్ ప్రయోగించిందన్నారు.

# మార్పు అనివార్యమే

మొదటిపేజీ తరువాయి..

ఆయనకే ప్రాధాన్యత ఇవ్వడం జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తికి ప్రధాన కారణమని తెలిపారు. అధిష్టానం తనను సంప్రదించకుండానే సంజయ్ ని పార్టీలో చేర్చుకుందని అప్పట్లోనే జీవన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆయన అనుచరులు నివాసం వద్ద పార్టీ ఫ్లెక్సీలను తొలగించడం రాజీనామా ఖాయమని ఇదివరకే స్పష్టం చేశాయి. జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను రంగంలోకి దింపింది. ఇద్దరు మంత్రులు శనివారం గంటల తరబడి చర్చలు జరిపి, పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆయన ససేమిరా అన్నట్లు సమాచారం. తనను నమ్ముకున్న కేడర్‌కు అన్యాయం జరుగుతున్నప్పుడు పదవుల్లో కొనసాగడం వృథా అని ఆయన మంత్రులకు కుండబద్దలు కొట్టినట్లు తెలుస్తోంది. ఇతర పార్టీ నుంచి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యం, వారి హవా నడుస్తుంటే అవమానాలు తట్టుకోలేక ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులకు చెప్పినట్లు జీవన్ రెడ్డి తెలిపారు. రాజకీయాలు అంటే గౌరవం కోసమే. కానీ గౌరవం లేని చోట ఎందుకు అని రాజీనామాకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కనీసం తనకు మానసిక ప్రశాంతత అయినా ఉంటుందంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి తదుపరి అడుగు ఎటువైపనే ఉత్కంఠ నెలకొంది. తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణను కార్యకర్తల సలహాలు, సూచనల మేరకు త్వరలోనే ప్రకటిస్తానని ఆయన లేఖలో వివరించారు. ఈ పరిణామాలతో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై కన్నేశాయి. క్లీన్ ఇమేజ్ ఉన్న ఆయన వంటి నేతను తమ వైపు తిప్పుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తుండగా, మరోవైపు ఆయన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారనే ప్రచారం జోరుగా సాగుతోంది. 25న రాజీనామా చేసిన వెంటనే జగిత్యాలలో సభ ఏర్పాటు చేసి తన కార్యాచరణను ప్రకటిస్తారని అనుచరులు చెబుతున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పట్టున్న జీవన్ రెడ్డి నిర్ణయం రాబోయే రోజుల్లో జిల్లా రాజకీయాల్లో మార్పులకు సంకేతంగా మారనుంది.

### భవన నిర్మాణ నిబంధనల్లో

# కీలక మార్పులు..

మొదటిపేజీ తరువాయి..

భవన నిర్మాణానికి, 60 ఫీట్ రోడ్ దగ్గర 4 అదనపు అంతస్తులకు, 80 ఫీట్ రోడ్ దగ్గర 5 అదనపు అంతస్తులకు ప్రభుత్వం అనుమతి ఇంచ్చింది. ఇక 10 అంతస్తులపైగా భవనాల నిర్మాణానికి మాత్రం వినియోగం తప్పనిసరి చేసింది ప్రభుత్వం. అలాగే 20 అంతస్తులపైగా భవనాలకు 5 శాతం లోడింగ్ కల్పించారు. ఇక 750–2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీరణం ఉన్న ప్లాట్లలో 18–21 మీటర్ల భవనాలకు తప్పనిసరి చేసింది. అలాగే నాన్ హై రైజ్ బిల్డింగ్స్‌కు సెట్‌బ్యాక్ సడలింపు ఇవ్వగా హై రైజ్ భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌కు అనుమతించనున్నారు. అలాగే బిల్డింగ్ అనుమతి సమయంలో 50 శాతం సమర్పించాలని, మిగతా 50శాతం టీడీఆర్‌ను ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు ముందు సమర్పించాలని ప్రభుత్వం తెలిపింది.

### భద్రాద్రిని అద్భుతంగా

# అభివృద్ధి చేయాలి

మొదటిపేజీ తరువాయి..

గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమావేశంలో సమీక్ష చేశారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి ఇప్పటివరకు పూర్తయిన భూసేకరణకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ సహజత్వానికి ఏమాత్రం భంగం కలగకుండా.. అభివృద్ధి పనులు పూర్తిగా ఆగమ శాస్త్రానుసారం చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆగమశాస్త్రానుసారం అభివృద్ధి పనుల నిర్వహణ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి.. దానికి సంబంధించిన అంచనాలతో తొలి దశ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలంగాణ సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలోని పుష్కర ఘాట్ల నిర్మాణం, అభివృద్ధి పనులు జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. 2027 మార్చి 31 నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి చేసే లక్ష్యంతో పనులు జరగాలని స్పష్టం చేశారు. పుష్కరాలు ముగిసిన అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు కూడా ఇప్పుడే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించనున్న కల్యాణోత్సవానికి తాను వస్తున్నట్లు సీఎం చెప్పినట్లు సమాచారం. కల్యాణోత్సవ ఏర్పాట్లపై కూడా సమీక్ష చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రాచలం ఆలయంలో శ్రీరామనవమి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖకు ఆదేశించినట్లు తెలుస్తోంది.



## భారీగా పడిపోయిన బంగారం, వెండి ధరలు!

మొదటిపేజీ తరువాయి..

గరిష్ఠమైన 5,602 డాలర్ల నుంచి దాదాపు 20 శాతం తగ్గి 4,488 డాలర్ల వద్ద స్థిరపడింది. ముఖ్యంగా గరిష్ఠ స్థాయిల వద్ద పెట్టుబడి పెట్టిన రిటైల్ ఇన్వెస్టర్లు ప్రస్తుతం నష్టాలను ఎదుర్కొంటున్నారు. అయితే ఈ పతనానికి ముందు బంగారం మార్కెట్ గణనీయమైన ర్యాలీని చూసింది. 2023 నుంచి ప్రతి సంవత్సరం 20 శాతానికి పైగా రాబడులు ఇస్తూ, 2025 నాటికి బంగారం ధర దాదాపు 65 శాతం పెరిగింది. ఈ వేగవంతమైన పెరుగుదల కారణంగా అనేక మంది పెట్టుబడిదారులు భావోద్వేగంతో లేదా అవకాశాన్ని కోల్పోతామనే భయంతో (ఫోమో) అధిక ధరలకు కొనుగోళ్లు చేశారు. భారతదేశంలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీగా పెట్టుబడులు రావడం దీనికి ఉదాహరణ. డిసెంబర్ 2025లో గోల్డ్ ఈటీఎఫ్‌లు రూ. 11,646 కోట్ల పెట్టుబడులను ఆకర్షించగా, జనవరి 2026లో తొలిసారిగా ఈక్విటీ ఫండ్ల కంటే ఎక్కువ పెట్టుబడులు ఈ విభాగంలో నమోదయ్యాయి. గోల్డ్ ఈటీఎఫ్‌లు భౌతిక బంగారంతో పోలిస్తే సురక్షితమైన, పారదర్శకమైన పెట్టుబడి మార్గంగా భావించబడుతున్నాయి. తయారీ ఖర్చులు, భద్రతా సమస్యలు లేకపోవడం వీటి ప్రధాన ప్రయోజనాలు. అయినప్పటికీ ధరల హెచ్చుతగ్గులు పెట్టుబడిదారులపై ప్రభావం చూపుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సరైన ఆస్తి కేటాయింపు అత్యంత కీలకం. నిపుణులు సాధారణంగా మొత్తం పెట్టుబడిలో 10–15 శాతం మాత్రమే బంగారంలో పెట్టాలని సూచిస్తున్నారు. ధరలు పడినప్పుడు కొనుగోలు చేయడం, పెరిగినప్పుడు కొంత లాభం తీసుకోవడం సమతుల్యతను కాపాడటానికి సహాయపడుతుంది. ఆర్బీఐ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. 2022 నుంచి బంగారం కొనుగోళ్లు పెంచిన ఆర్‌బిఐ, 2025లో వాటిని తగ్గించింది. ప్రస్తుతం విదేశీ మారక నిల్వల్లో బంగారం వాటా సుమారు 16 శాతానికి చేరింది. భవిష్యత్తులో బంగారం ధరల దిశ ప్రధానంగా అమెరికన్ డాలర్ బలం, వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం, గ్లోబల్ అనిశ్చితిపై ఆధారపడి ఉంటుంది. క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రమే ఈ హెచ్చుతగ్గులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ప్రధాని కీలక భేటీ

మొదటిపేజీ తరువాయి..

నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై మంత్రులతో ప్రధాని మోదీ చర్చించారు. గ్యాస్, పెట్రోల్ , ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్న ప్రధాని, సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. మరోవైపు గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సిటీ గ్యాస్ ప్రాజెక్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూనే, కీలక రంగాలకు వాణిజ్య ఎల్‌పిజి కేటాయింపులను పెంచింది. పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) సరఫరాను పెంచేందుకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ దరఖాస్తులను 10 రోజులలోపు పరిష్కరించాలని పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ ఆదేశించింది. ఎల్పీజీపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, పీఎన్‌జీకి మారాలని పట్టణ, నగరాల్లోని వాణిజ్య ఎల్పీజీ వినియోగదారులకు సూచించింది. అటు ఎల్పీజీకి సంబంధించి ఇప్పటికే పునరుద్ధరించిన 20 శాతానికి అదనంగా మార్చి 18న మరో 10 శాతం, మార్చి 21న మరో 20 శాతం కేటాయింపులు పెంచారు. ఫలితంగా న్రా+ సరఫరా 50 శాతానికి చేరింది. హోటళ్లు, రెస్టారెంట్లు, డైరీ పరిశ్రమలు, కమ్యూనిటీ కిచెన్‌లు, విద్యా సంస్థలకు సరఫరాలో ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డొమెస్టిక్ వంట గ్యాస్ సరఫరా స్థిరంగా ఉందని, ఎక్కడా కొరత లేదని అధికారులు స్పష్టం చేశారు. భయాందోళనలతో చేసే బుకింగ్‌లు కూడా తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వం పేర్కొంది.

## మాట వినని ఇతర దేశాలపై అమెరికా ఆంక్షలు సరికాదు

- ఏప్రిల్ 1 నుంచి 10 వరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమం విజయవంతం చేయాలి
- కలవెన శంకర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు



**మంచిర్యాల, 22, మార్చి (ప్రజా జ్యోతి) :** మంచిర్యాలలో సిపిఐ జిల్లా సమితి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవెన శంకర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 1 నుంచి 10 వరకు నిర్వహించనున్న "ఇంటింటికి సిపిఐ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే నిధుల సేకరణ చేపట్టాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో పార్టీ తరపున అభ్యర్థులను నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పరిస్థితులపై స్పందిస్తూ, ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడులు నిలిపివేయాలని, తమ మాట వినని ఇతర దేశాలపై అమెరికా ఆంక్షలు విధించడం సరికాదని విమర్శించారు. సింగరేణి సంస్థను రక్షించుకోవాలంటే కొత్త భూగర్భ గనులు ప్రారంభించాలని సూచించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) ఆధ్వర్యంలో "సేవ్ సింగరేణి" కార్యక్రమం ఈ నెల 18న శ్రీరాంపూర్‌లో ప్రారంభమై, ఈ నెల 30 వరకు సింగరేణి వ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. చివరగా కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమంతో ఈ ఉద్యమం ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌తో పాటు రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్, ఇప్పకాయల లింగయ్య, ముస్కె సమ్మయ్య, చిప్ప నర్సయ్య, అదేపు రాజమొగిలి, కామెర దుర్గా రాజు, మిట్టపల్లి పౌల్, మిర్యాల రాజేశ్వర్ రావు, బొంతల లక్ష్మినారాయణ, కొండు బానేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాలెగూడలో జల్ జీవన్ మిషన్ జల మహోత్సవం

ప్రతి ఇంటికి శుద్ధ జలం అందించడం ఆనందకరం : అదనపు కలెక్టర్ డేవిడ్






**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 22 ప్రజా జ్యోతి :** సాలెగూడ గ్రామంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమం భాగంగా జల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం ద్వారా అందిస్తున్న శుద్ధ జలాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు గతంలో తీవ్రంగా ఉండేవని, మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం తీసుకున్న చొరవతో జల్ జీవన్ మిషన్ అమలు కావడంతో, ఇప్పుడు ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా శుద్ధమైన తాగునీరు అందుతున్నదని తెలిపారు. ఈ మార్పు గ్రామ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. అలాగే శుద్ధ జలాన్ని వినియోగించడమే కాకుండా, నీటిని ఆదా చేయడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. నీటి వనరులను సంరక్షించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు కూడా తాగునీటి కొరత లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. గ్రామస్థులు నీటి వృథాను నివారిస్తూ, పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వందన మాట్లాడుతూ, గ్రామంలో మొదటిసారిగా ప్రతి ఇంటికి శుద్ధ జల సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల గ్రామ ప్రజలు అనేక ఇబ్బందుల నుంచి విముక్తి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ జల మహోత్సవంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పెంబి హరిహర ఆలయ ఉత్సవాల్లో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే

వెడ్మ బొజ్జు పటేల్





**ఖానాపూర్ (పెంబి) మార్చ్ 22 (ప్రజా జ్యోతి) :** ఖానాపూర్ నియోజకవర్గం లోని గిరిజన మండల కేంద్రమైన పెంబిలో గల పరిహార ఆలయ ఉత్సవాల్లో ఆదివారం మధ్యాహ్నం శాసనసభ్యుడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడమ బొజ్జుపటేల్ పాల్గొన్నారు శనివారం నుండి ప్రారంభమైన ఈ ఉత్సవాలకు వేద పండితులు చక్రపాణి నరసింహా మూర్తి ఆలయ అర్చకులు సంయుక్తంగా ఆలయ కమిటీ సభ్యులచే ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి హరిహర క్షేత్ర స్వాముల ఆశీర్వాదాలు అందించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ ధర్మకర్తలు సల్ల పెద్ద రామేశ్వర్ రెడ్డి గన్నారపు సురేష్ ఆమెడ కిషన్ తదితర సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హరిహరులైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర శివ పార్వతుల కరుణాకటాక్షాలతో నియోజకవర్గం శాంతి సౌభాగ్యాలతో మెలగాలని ఈ సందర్భంగా అన్నారు ఆలయ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో పెంబి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మల్లేపల్లి సత్యనారాయణ స్వామి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు స్వప్నల్ రెడ్డి దేవేందర్ రెడ్డి పుప్పాల శంకర్ గుడిసె రమేష్ యాదవ్ ఖానాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొనికేని దయాకర్ తో పాటు స్థానిక నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల వారిని మోసం చేసిన కాంగ్రెస్ బడ్జెట్ హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్




**జన్నారం, మార్చ్ 22 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రోజున ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని జన్నారం మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు ఆదివారం రోజున మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారిని మోసం చేసిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు 2500 ఇస్తామని, రైతులకు రైతు భరోసా కింద 15000 ఇస్తామని, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12000 ఇస్తామని,వృద్ధులకు 4000 పెన్షన్, దివ్యాంగులకు 6000 పెన్షన్ ఇస్తామని, విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్ షిప్ లు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఇలా అన్ని వర్గాల వారికి హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దేశానికి వెన్నెముక లాంటి రైతుకు రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, ఇప్పటికే ఉన్న రైతుబంధు పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారని విమర్శించారు. ఇప్పటికీ మూడుసార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారిని తీవ్రంగా నిరాశపరిచిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్, మాజీ కో అప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్,మాజీ ఎంపీపీ చెటుపల్లి సత్యం, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బాణావత్ రాములు నాయక్, సీనియర్ నాయకులు ఫజల్ ఖాన్, వొల్లాల నర్సా గౌడ్, బందెల ప్రేమ్ సాగర్, రవి, మల్లేష్, ఇప్ప రాకేష్, దాసరి శ్రీనివాస్, దుర్గం లక్ష్మణ్, శ్రీధర్ రావు, సోషల్ మీడియా అధ్యక్షుడు జునుగురు గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ ట్రస్ట్ సమావేశం

- సిఎంపిఎఫ్ సబ్ కమిటీ నిర్ణయాలు
- బొగ్గు మాజీ ఉద్యోగుల పెన్షనర్లకు ఊరట




**మంచిర్యాల, 22 మార్చి (ప్రజా జ్యోతి) :** కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) హెడ్‌క్వార్టర్స్, కొల్కతాలో నిర్వహించిన సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ ట్రస్ట్ బోర్డ్ 7వ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇదే రోజు జరిగిన సిఎంపిఎఫ్ (కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్) ఇన్వెస్ట్‌మెంట్ సబ్ కమిటీ వర్చువల్ సమావేశంలో ముగ్గు విశ్రాంతి ఉద్యోగులైన పెన్షనర్లకు ఊరట కలిగించే నిర్ణయం వెలువడింది. ట్రస్ట్ బోర్డ్ సమావేశంలో డైరెక్టర్ (ఫైనాన్స్), సిఐఎల్ మరియు డైరెక్టర్ (హ్యూమన్ రిసోర్సెస్), సిసిఎల్‌లకు సెలవులు మంజూరు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్ట్‌ను కేఏఎస్‌జీ అండ్ కో రూపొందించగా, దానిని పరిశీలించి ఆమోదించారు. సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ స్థిరత్వంపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. మెడికల్ బిల్లుల సమర్పణలో ఆలస్యం తగ్గించేందుకు ఫార్మాట్‌ను సరళీకరించడంతో పాటు, బిల్లుల ట్రాకింగ్ కోసం ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలించాలని తీర్మానించారు. ట్రస్ట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా డాక్టర్ వినయ్ రంజన్‌ను చైర్మన్‌గా కొనసాగిస్తూ, ముకేష్ అగర్వాల్, కేశవ్ రావు, హెచ్.ఎన్. మిశ్రాలను సభ్యులుగా కొనసాగించారు. ట్రేడ్ యూనియన్ తరపున ఓం కుమార్ సింగ్ (బిఎంఎస్), అశోక్ కుమార్ పాండే (హెచ్ఎంఎస్)లను కొత్త సభ్యులుగా చేర్చగా, అశోక్ చంద్ర యాదవ్ (ఏఐటీయూసీ), వామన్ మను మనోహర్ (సిటియు) కొనసాగుతున్నారు. గౌతమ్ బెనర్జీ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. సమావేశాలకు జీఎం (పిఆర్‌బి), ఈడీ (ఫైనాన్స్)లను ప్రత్యేక ఆహ్వానితులుగా చేర్చాలని నిర్ణయించారు. సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ ట్రస్ట్ బ్యాంక్ ఖాతా నిర్వహణలో ఈడీ (ఫైనాన్స్), జీఎం (పిఆర్‌బి)లకు కూడా అధికారం ఇచ్చి, సంతకదారుల జాబితాను సవరించారు. ఇక, ఇదే రోజు జరిగిన సిఎంపిఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్ కమిటీ వర్చువల్ సమావేశంలో ట్రేడ్ యూనియన్ తరపున అశీష్ మూర్తి (బిఎంఎస్) మాత్రమే పాల్గొన్నారు. వారి చొరవతో ఎఫ్‌పిఎస్-71 సభ్యుల డిపెండెంట్లకు ఇవ్వబడే నెలసరి పెన్షన్‌ను వెయ్యి నుంచి పెంచే ప్రతిపాదనను సబ్ కమిటీ ఆమోదించింది. ఈ ప్రతిపాదనను తుది ఆమోదం కోసం త్వరలో జరిగే ట్రస్ట్ బోర్డ్ సమావేశంలో ఉంచనున్నారు. ఈ వర్చువల్ సమావేశానికి విక్రమ్ దేవ్ దత్ (కోల్ సెక్రటరీ), రూపేందర్ బ్రార్ (అడిషనల్ సెక్రటరీ), సిఎంపిఎఫ్ కమిషనర్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, సిఐఎల్ చైర్మన్ హాజరయ్యారు. సమావేశం పూర్తిగా సబ్ కమిటీ స్థాయిలో నిర్వహించబడింది. ఈ నిర్ణయాన్ని సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన పులి రాజారెడ్డి (సలహాదారు), రామకాంత్ (ప్రధాన కార్యదర్శి) లు స్వాగతించారు.

## పెన్షన్ కోసం పోరాటం... బొగ్గు పెన్షనర్ల గళం జంతర్-మంతర్‌లో మార్మోగనుంది

- మార్చి 30న భారీ ధర్నాకు పిలుపు ఇచ్చిన ఏఐసీపీఏ/ఏఐఏసీఈ కన్వీనర్ పి.కె. సింగ్ రాథోర్







**మంచిర్యాల, 22,మార్చి (ప్రజాజ్యోతి) :** జీవితాంతం బొగ్గు రంగానికి సేవలందించిన పెన్షనర్ల హక్కుల సాధన కోసం మరోసారి ఉద్యమ జ్వాలలు రగులుతున్నాయి. పెన్షన్ సవరణ కోసం మార్చి 30, 2026న న్యూఢిల్లీలోని జంతర్-మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు అఖిల భారత బొగ్గు పెన్షనర్ల సంఘం (ఏఐసీపీఏ), అఖిల భారత బొగ్గు కార్యనిర్వాహకుల సంఘం (ఏఐఏసీఈ) కన్వీనర్ పి.కె. సింగ్ రాథోర్ ప్రకటించారు. బొగ్గు రంగంలో దశాబ్దాల పాటు కష్టపడి పని చేసిన పెన్షనర్లకు న్యాయం జరగా లని, వారి జీవిత భద్రత కోసం పెన్షన్ సవరణ అత్యవసరమని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు, ప్రస్తుతం పనిచేస్తున్న కార్యనిర్వాహ కులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. "ఇది కేవలం ధర్నా కాదు... మన హక్కుల కోసం పోరాటం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉద్యమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని, ఫోటోలు, వీడియోల ద్వారా ఉద్యమాన్ని మరింత విస్తృతంగా చాటాలని సూచించారు.

వృద్ధాప్యానికి లొంగని సంకల్పం... ఇంటి వద్ద నుంచే సంఘీభావ ధర్నా వృద్ధాప్యం, అనారోగ్యం లేదా ఇతర కారణాల వల్ల జంతర్-మంతర్‌కు వెళ్లలేని పెన్షనర్లు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని పి.కె. సింగ్ రాథోర్ పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తమ ఇళ్లలో లేదా సమీప ప్రదేశాల్లో కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని నినాదాలు చేస్తూ సంఘీభావ ధర్నా నిర్వహించాలని సూచించారు.

**"మన గళం ఎక్కడ నుంచైనా వినిపించాలి...** మన ఐక్యతే మన బలం" అని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ విధంగా స్పందన వ్యక్తమైతే ప్రభుత్వం త్వరితగతిన పెన్షన్ సవరణపై నిర్ణయం తీసుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## వడూర్‌లో ఉచిత వైద్య శిబిరం







- ప్రారంభించిన ఆడే గజేందర్

**నేరడిగొండ మార్చి 22 (ప్రజాజ్యోతి) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువ చేయడమే లక్ష్యంగా వడూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. కీ.శే. ఆడే సాకారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో, నిర్మల్ శ్రీ కృష్ణ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. పేద ప్రజలు ఖరీదైన వైద్యం పొందలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో, వారి ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలు అందించడం సంతోషకరమని అన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

**ఉచిత పరీక్షలు - మందుల పంపిణీ :** శిబిరానికి వచ్చిన వందలాది మంది రోగులకు శ్రీ కృష్ణ హాస్పిటల్ వైద్య బృందం వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. పరీక్షల అనంతరం బాధితులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పాల్గొన్న ముఖ్య నేతలు : ఈ కార్యక్రమంలో స్థానిక మరియు నియోజకవర్గ స్థాయి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సర్పంచ్‌లు ఆడేపు శ్రీకాంత్ (వడూర్), రాథోడ్ సునీత మధుకర్ (బొందిడి), ఆడే సీతారాం (దర్బతండ). నాయకులు: వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడి రవి, బుక రాములు, పాల శంకర్, ఆత్మ డైరెక్టర్ కుంట శంకర్, బోల్శెట్టి రాములు, రాం పెద్ద బాపు. యువజన, విభాగాల నేతలు: బద్దం పోతారెడ్డి (యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు), కొత్తూరి లక్ష్మణ్ (ఎస్సీ సెల్ చైర్మన్), ఆడే సతీష్ నాయక్, యండి సద్దాం, షకీల్, ఇక్బాల్, అమీర్, గంధం నవీన్, ఇసాక్, ప్రవీణ్, అశోక్, ఉషన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికులకు మొండి చెయ్యి

వారి ఆశలపై నీరు చల్లిన ప్రభుత్వం




**జన్నారం, మార్చ్ 22 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం రోజు ప్రవేశపెట్టిన బడ్జెట్లో సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించక గల్ఫ్ కార్మికులకు మొండి చేయి చూపిందని, వారి ఆశలపై నీరు చల్లిందని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి దుబాయ్ శాఖ అధ్యక్షుడు ఎరుకల రాజు గౌడ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అలీమ్ ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ సం క్షేమ బోర్డు ఎన్నారై పాలసీ ద్వారా గల్ఫ్ కార్మికులకు అండగా ఉంటామని, అవసరమైన నిధులు కేటాయిస్తామని నమ్మబలికి ఎన్నికల్లో గెలిచిన తర్వాత బడ్జెట్లో గల్ఫ్ బోర్డ్ ఎన్నారై పాలసీ ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో గల్ఫ్ కార్మికుల కోసం నిధులు కేటాయించకపోవడం వలన గల్ఫ్ కార్మికులు వారి కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురయ్యా రని అన్నారు. గల్ఫ్ కార్మికులు మరో ఉద్యమానికి సిద్ధం కావలసిన తరుణం ఆసన్నమైందని ఈ ఉద్యమంలో ప్రతి గల్ఫ్ కార్మికుడు ప్రతి కుటుంబీకుడు భాగస్వాములు కావా లని అలాగే ఔరే ఏక్ దక్క- గల్ఫ్ బోర్డ్ పక్క, జై గల్ఫ్, జై జై గల్ఫ్ బోర్డు అనే నినాదంతో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సం క్షేమ సమితి నాయకులు కార్మికులు సిద్ధంగా ఉండాలని వారి కోరారు.

## ఖానాపూర్ చేరిన ఆదివాసుల పాదయాత్ర

- 16 గ్రామాలకు రహదారులు లేక ఇక్కట్లు
- నేడు కలెక్టర్‌ను కలవనున్న అడవి బిడ్డలు
- సిపిఐ (ఎం) ఆధ్వర్యంలో మూడు రోజులుగా మండుటెండల్లో నడక



**ఖానాపూర్ మార్చ్ 22 (ప్రజాజ్యోతి) :** 16 గ్రామాల ఆదివాసులకు రహదారులు లేక ఎవరు పట్టించుకునే దాఖలాలు కానరాక సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా పెంబి గిరిజన మండలం నుండి పాదయాత్ర ఆదివాసి అడవి బిడ్డలు సాగించారు. ఆదివారం ఉదయం తొర్లపాడు మీదుగా ఖానాపూర్ పట్టణం చేరుకున్నా రు సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ ను కలిసి తమ సమస్యల్ని వినతించనున్నట్లు ఆదివాసులు తెలిపారు పట్టణం చేరుకొని ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా నిర్మల్‌కు తిరిగి కాలినడకన తరలి వెళ్లారు. పెంబి మండలంలోని యాపలగూడెం గ్రామం నుంచి నిర్మల్ జిల్లా కేంద్రం వరకు 75 కిలోమీటర్ల దూరంలో 3 రోజుల పాటు సాగే సీపీఐ(ఎం) పాదయాత్ర ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఉడుత. రావీశదర్ మాట్లాడుతూ ప్రాంత అభివృద్ధి కోసం పలు ముఖ్యమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దోత్తి, కడెం వాగులపై వెంటనే వంతెనలు నిర్మించి 16 గ్రామాల గిరిజన రహదారి సౌకర్యం కల్పించాలని అన్నారు. పెంబి మండల ప్రభుత్వ ఆసుపత్రికి డాక్టర్‌ను కేటాయించాలని ఆదివాసి గ్రామాలకు శుద్ధమైన మంచినీటి సౌకర్యం కల్పిస్తూ బోర్లు ఏర్పాటు చేయాలని పసుపుల వాగుపై బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేసారు. పెంబి మిదుగా సిరి చల్మా వరకు రహదారి నిర్మించాలన్నారు మరో సిపిఐ నేత బొమ్మెనసురేష్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. ఇంటి గ్రేటర్ స్కూల్‌ను ప్రారంభించాలన్నారు ఖానాపూర్ పట్టణ 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని అన్నారు.

**ఖానాపూర్ పట్టణంలో రోడ్లను విస్తరించాలి :** పోడు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని,ఖానాపూర్ టౌన్‌లో రోడ్డుపై అమ్ముకుంటున్న చిరు వ్యాపారులకు సమీకృత మార్కెట్ నిర్మాణం ఏర్పాట్లు చేయాలి, అల్లంపెల్లి గంగాపూర్, బ్రిడ్జ్ నిర్మించి రహదారి, రైతులకు రుణమాఫీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించి, ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు,దుర్గ నూతన కుమార్, తొడసం. శంభు, జిల్లా కమిటీ సభ్యురాలు, కామాక్షి, నాగేలి. నరసయ్య, పశు వుద్దిన్, ఆదివాసి గ్రామాల లీడర్స్ నిర్మల, ఉమ్మెనా ఉపసర్పంచ్, టేకం ధర్మరాజు, కోసగుట్ట గ్రామ ఉపసర్పంచ్, కొమురె. పగ్గ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, గిరిజన సంఘ జిల్లా అధ్యక్షులు విజయ్, విశాఖ జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్ దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మార్కెట్ చైర్మన్ కడార్ల గంగా నరసయ్య

- 50 సంవత్సరాల పెళ్లిరోజులో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఖానాపూర్ మార్చి 22 (ప్రజాజ్యోతి) :** ఖానాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడర్ల గంగా నరసయ్య దంపతుల 50 సంవత్సరాల పెళ్లి రోజు సందర్భంగా జరిగిన జెకె ఫంక్షన్ హాల్ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వేడమ బొజ్జ పటేల్ పాల్గొని దంపతుల ఆశీస్సులు తీసుకున్నారు అనంతరం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు అంకం రాజేందర్ రాజుర సత్యం కౌన్సిలర్ నిమ్మల రమేష్ మండల పార్టీ అధ్యక్షులు దొనికేని దయానంద్. జంగిల్ శంకర్ స్వప్నిల్ రెడ్డి జొన్నరపు శంకర్ మధిర సత్యనారాయణ రాజు నాయక్ మేదరి రాజేశ్వర్ నేత శ్యామ్ శక్తి శ్యాంసుందర్ శ్రీపాద శేషాద్రి చింతపండు రవీందర్ పాల్గొన్నారు.

## 23 నుంచి తిరిగి ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మార్చి 22(ప్రజా జ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 23వ,తేదీ సోమవారం నుంచి యథావిధిగా తిరిగి ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్



బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు.గత సోమవారం జనాభా గణన శిక్షణ కార్యక్రమాల నేపథ్యంలో అధికారులకు వ్యస్తత ఉండటంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం ఆ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు,వినతిపత్రాలను స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ప్రజలు తమ సమస్యలపై నేరుగా ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.అలాగే అన్ని మండల కేంద్రాలలోని తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి,ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

## రాజనగరం చెరువు అలుగు పునరుద్ధరణ వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (ప్రజాజ్యోతి): పట్టణంలోని 12వ వార్డు రాజనగరంలో ఉన్న చెరువు అలుగుల పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వనపర్తి



శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. చెరువులో పేరుకుపోయిన మురికి నీటిని గ్రామం వెలుపలికి మళ్లించే విధంగా సరైన కాలువ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే స్పందించి పునరుద్ధరణ పనులు చేపట్టడం సంతోషకరమని వారు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో నిర్మించిన పల్లె దవాఖాన నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన ఎమ్మెల్యే, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి దవాఖానను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే వడ్డేవాడలోని ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయం సమీపంలో ఉన్న పెద్ద మురికి కాలువ ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నక్క రాణి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, న్యాయవాది బుచ్చన్న, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్కరాజు, వార్డు అధ్యక్షులు గొడుగు రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, కొత్త గొల్ల శ్రీనివాసులు, నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కందూరు గోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ సంజీవ్ సాగర్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, వడ్డే శ్రీనివాసులు, ముద్దంగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి వార్డు సభ్యులు

- ఎమ్మెల్యే మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లోకి పాతపల్లి బిఆర్ఎస్ నాయకులు

వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (ప్రజాజ్యోతి): పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి



చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన 2వ వార్డు సభ్యురాలు కవిత, 4వ వార్డు సభ్యురాలు ఉషనమ్మ శనివారం మాజీ సర్పంచ్ పి రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వనపర్తిలోని నంది హిల్స్ వద్ద ఉన్న తన నివాస కార్యాలయంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆకర్షితులై పార్టీ మారినట్లు తెలిపారు. పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. వారితో పాటు మరో 25 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనను కొనసాగిస్తూ నిరుపేదలకు సంక్షేమ పథకాలను గ్రామ స్థాయికి తీసుకెళ్తోందన్నారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు కాంగ్రెస్ పాలనలో ఉన్నాయని చెప్పారు. పార్టీలో చేరినవారు కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ముత్త రాములు, పాతపల్లి రవీందర్, వెంకటయ్య, శ్రీరాములు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్యే నాయకత్వం - జిల్లా కమిటీకి శివసేన రెడ్డి దిశానిర్దేశం

- పదవులు కాదు, పనితీరే ముఖ్యం
- గ్రామస్థాయి నుంచి బలోపేతం
- జిల్లా కమిటీకి కీలక సూచనలు చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (ప్రజాజ్యోతి): ప్రజలకు, కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా వెన్నంటే నిలుస్తూ పట్టు విడని విక్రమార్కుల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పూర్తి స్థాయి జిల్లా కమిటీతో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి, శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. శివసేన రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్టానం ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా కమిటీని పూర్తిస్థాయిలో నియమించినట్లు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామ, మండల కమిటీలను త్వరగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల ఎన్నికైన కమిటీ ఆరు ముఖ్య అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని త్వరలో చేపట్టాలని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రతిపాదించగా, కమిటీ సభ్యులందరూ ఆమోదించినట్లు చెప్పారు. పదవులను అలంకరణప్రాయంగా కాకుండా ప్రజల కోసం వినియోగించాలని, క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రజల మనసు గెలుచుకోవాలని సూచించారు. పనితీరు ఆధారంగా అవసరమైతే మార్పులు కూడా జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్



మధుసూదన్ గౌడ్, పిసీసీ డెలిగేట్ తైలం శంకర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, బ్రహ్మచారి, సాయి చరణ్ రెడ్డి, అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, చిర్ల జనార్దన్ సాగర్, యువజన జిల్లా అధ్యక్షులు ఆదిత్య, పాండు సాగర్, కౌన్సిలర్లు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీ బడ్జెట్ లో జర్నలిస్టుల ప్రస్తావనే లేదు

టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు చక్కెర రామచంద్రయ్య

కొల్లాపూర్ మార్చి 22 ప్రజా జ్యోతి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లో జర్నలిస్టులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావనే లేదు సమాచార శాఖ ను ప్రభుత్వం మరిచిపోయింది మీడియా అకాడమీ గురించి బడ్జెట్లో ఏమి చెప్పలేదు. బడ్జెట్ లో నిధులను కేటాయించకుండా సంక్షేమ కార్యక్రమాలను ఎలా అమలు చేస్తారు? ఇండ్ల స్థలాల గురించి కూడా ఏమీ చెప్పలేదు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత జర్నలిస్టులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.కనీసం అక్రిడిటేషన్ కూడా ఇవ్వలేదు రెండు యేండ్లుగా గడువును పొడిగించుకుంటూ పోతున్నారు ఇది అన్యాయం కాదా? ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరినా సర్కార్ స్పందించడం లేదు వేలాది మంది జర్నలిస్టులు బడ్జెట్ పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు ఉత్తమ జర్నలిస్టు అవార్డు ల ప్రస్తావనే తేలేదు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాజం దృష్టికి తీసుకుపోతున్న మీడియా పట్ల పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తున్నది అక్రిడిటేషన్స్ ఇండ్ల స్థలాలు హెల్త్ కార్డులు మహిళా జర్నలిస్టుల సమస్యలపై బడ్జెట్ లో రేఖామాత్రంగా కూడా ప్రస్తావించికపోవడం అన్యాయం.ఫ్యూచర్ సిటీలో ఇండ్ల స్థలాలు ముఖ్యమంత్రి హమీ ని సైతం బడ్జెట్ లో చెప్పకపోవడం జర్నలిస్టులను ఆవేదన ఆందోళన కు గురిచేస్తున్నది.ఈ విషయం లో ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా జిల్లా మండలంలో టీ డబ్ల్యూ జె ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు నివసిస్తామని టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు చక్కెర రామచంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల కుటుంబాలలో అనేక సమస్యలు ఉన్న, వాటిని పరిష్కరించుకొని బయట సమాజంలో జరుగుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అభివృద్ధి గురించి ప్రభుత్వాలకు చేరవేస్తూ. వాటిని మరల ప్రజలకు వివరిస్తూ తన వంతుగా జర్నలిస్టులకు 40 సంవత్సరాల నుండి జర్నలిజంలో కొనసాగుతున్న వారికి నాటి నుండి నేటి వరకు గుండు సున్న.ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వము ముఖ్యమంత్రి అనుమల రేవంత్ రెడ్డి జర్నలిస్టుల పట్నం మండల్ వైఖరి విడనాలి జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి, అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలలో కార్యకర్తలకు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరి జర్నలిస్టులకు ఎందుకు ఇవ్వలేకపోతున్నారు. అంటే కనీసం మా





జర్నలిస్టు కోటాలో ఉన్న పథకాలను మేము అడుగుతున్నాము వాటిని జర్నలిస్టులకు ఎందుకు అమలు చేయలేకపోతున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వం పైన ధ్వజమెత్తారు.

# ప్రపంచ జల దినోత్సవం నీటి సంరక్షణ మన బాధ్యత

- నీటిని కాపాడుతే భవిష్యత్తును కాపాడినట్లే
- మనం నీటిని పరిక్షించి ప్రకృతిని నేర్చుకుందాం
- సుస్థిరమైన భవిష్యత్తును నిర్మిద్దాం
- నీటిని అదా చేయకండి జీవాన్ని కాపాడండి

కొల్లాపూర్ మార్చి 22 ప్రజా జ్యోతి ప్రతి సంవత్సరం మార్చి 22న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకుంటారు. నీటి ప్రాధాన్యతను గుర్తుచేసేందుకు నీటి వనరులను పరిరక్షించాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయడానికి ఈ రోజు ఎంతో ముఖ్యమైనది. నీరు ఉంటేనే జీవం అనే నానుడి మనకు తెలిసినదే భూమిపై ఉన్న ప్రతి జీవికి నీరు అత్యవసరం.మన రోజువారీ జీవితంలో నీరు కీలక పాత్ర పోషిస్తుంది త్రాగుటకు,వ్యవసాయానికిపరిశ్రమలకు, పరిశుభ్రతకు నీరు అవసరం. కానీ ప్రస్తుతం నీటి కొరత ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది జనాభా పెరుగుదల అటవీ నరికివేత కాలుష్యం వర్షపాతం లోపం వంటి కారణాల వల్ల నీటి వనరులు క్షీణిస్తున్నాయి. నీటి సంరక్షణ మనందరి బాధ్యత చిన్నచిన్న చర్యలతోనే మనం పెద్ద మార్పును తీసుకురాగలము ఉదాహరణకు. అవసరమైనంత నీటినే ఉపయోగించడం లీకేజీలను వెంటనే సరిచేయడం వర్షపు నీటిని నిల్వ చేయడం (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) చెట్లు నాటడం మరియు ప్రకృతిని కాపాడడం ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించి ఉపయోగించాలి. భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకోవాలి ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి.మొత్తానికి ప్రపంచ జల దినోత్సవం మనకు ఒక సందేశాన్ని ఇస్తుంది నీరు కాపాడితేనే భవిష్యత్తు కాపాడినట్లే మనం నీటిని పరిరక్షించి ప్రకృతిని ప్రేమించి సుస్థిరమైన భవిష్యత్తును నిర్మిద్దాం నీటిని ఆదా చేయకండి జీవాన్ని కాపాడండి.




## కొల్లాపూర్ లో ప్రతిపక్ష పార్టీల సర్పంచులకు అవమానం

ప్రోటోకాల్ పాటించకుండా చెక్కులు పంపిణీ

కొల్లాపూర్ మార్చి 22 ప్రజా జ్యోతి కొల్లాపూర్ మండలం పరిధిలో ఉన్న సింగోటం గ్రామపంచాయతీ ల ప్రతిపక్ష పార్టీల సర్పంచులకు అవమానం...? ప్రోటోకాల్ పాటించకుండాస్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు అవమానిస్తున్నారా. మొన్న కళ్యాణ లక్ష్మి చెక్కులు వచ్చి రెండు మూడు నెలలు అవుతున్నా గ్రామ సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులతో నా కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయించడం ఏమిటి.ఇప్పుడేమో గ్రామాలలో ని సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ సర్పంచి అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చి పంపిణీ చేయించడం ఏమిటి.ప్రజల మద్దతుతో గెలిచినసర్పంచులను అవమానించి ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడం కాదా...రాజ్యాంగం అంటే గౌరవం లేదా. ఎంపీడీవో లాగిన్ లో ఉండే ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు కాంగ్రెస్ పార్టీ నాయకుల దగ్గరికి ఎలా వెళ్లాయి అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ప్రజల మద్దతుతో ప్రజాస్వామ్య పద్ధతి ప్రకారంగా గెలిచిన సర్పంచ్లను మేము ఎంపీడీవో గారి మీద సంబంధిత అధికారుల మీద కలెక్టర్ గారికి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేస్తాం,కేంద్ర ప్రభుత్వం బిజెపి పార్టీ నరేంద్ర మోడీ గ్రామపంచాయతీలకు నిధులు ఇస్తున్నారు ఆ నిధులు ఏమన్నా బిజెపి పార్టీ అభ్యర్థి గెలిచిన



గ్రామ పంచాయతీలకే ఇస్తున్నారా ఏమన్నా, లేదు కదా అన్ని గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం బిజెపి పార్టీ నరేంద్ర మోడీ గారి నిధులు ఇస్తున్నారు కదా. అలాంటప్పుడు గ్రామంలో సర్పంచ్ గా ఉన్న వారిని సభకు పిలవకుండా అవమానపరిచిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులకు కాంగ్రెస్ పార్టీ నేర్పించిన సభ్యత సంస్కారం ఇదేనా. ఇది భారత రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లే దీనిపైన మాకు ప్రజా పాలన ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ తరపున ప్రజా పాలన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్ గౌడ్, కొల్లాపూర్ మండల పార్టీ అధ్యక్షులు కేతూరి నారాయణ. మాచినేని పల్లి గ్రామ సర్పంచ్ చంద్రయ్య. సింగోటం గ్రామ ఉపసర్పంచ్ సాయి కృష్ణ గౌడ్. జగపతిరావు. మల్లయ్య. మౌలాలి. రామకృష్ణ. మహేష్. తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పీపీటీ ప్రవేశ పరీక్ష

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 22 (ప్రజా జ్యోతి) పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ వారి ప్రవేశ పరీక్ష ఈరోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి డిగ్రీ కాలేజీలో టీఎస్ యుటిఎఫ్ నారాయణపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్



(టీఎస్ యుటిఎఫ్) నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షులు కే బాలాజీ మరియు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు నరహరి లతో కలిసి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలోని అనాధ , పాక్షిక అనాధ మరియు నిరుపేద విద్యార్థులకు ఉచితంగా హైద్రాబాద్ లోని ప్రగతినగర్ లో రెసిడెన్షియల్ విద్యను అందించడం జరుగుతుంది. ఈరోజు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 07 మంది విద్యార్థుల్లో 06మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ప్రశాంతంగా ఈ పరీక్ష నిర్వహించినట్లు వారు తెలిపారు. వారం రోజులు లోపు ఈ పరీక్షకు సంబంధించిన ఫలితాలను వెల్లడిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి పి టి పరీక్ష పరిశీలకులు రమావత్ నాయక్ , ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కళారంగంలో యశ్వంత్ మాస్టర్‌కు గుర్తింపు... డైరెక్టర్ పదవి వరం

- అంతర్జాతీయ స్థాయికి వనపర్తి కళాకారులు
- వనపర్తి జిల్లా ఫైన్ ఆర్ట్స్ డెవలప్మెంట్ కమిటీ డైరెక్టర్‌గా యశ్వంత్ మాస్టర్

వనపర్తి ప్రతినిధి, మార్చి 22 (ప్రజాజ్యోతి): తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆఫ్రికా ఇండియా ఎకానమీ ఫౌండేషన్ (AIEF) ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఫైన్ ఆర్ట్స్ డెవలప్మెంట్ కమిటీ డైరెక్టర్‌గా యశ్వంత్ మాస్టర్‌ను నియమించారు. లలిత కళల పట్ల యశ్వంత్ మాస్టర్‌కు ఉన్న ఆసక్తి, గత కొన్ని సంవత్సరాలుగా కళారంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన ఫౌండేషన్ ప్రతినిధులు ఈ బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు వారు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన పలు డాన్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్న ఆయన అనేక అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాస్టర్ మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలోని గ్రామీణ కళాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో నృత్యం పట్ల ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రపంచానికి పరిచయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఏఐఈఎఫ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఈఎఫ్ వ్యవస్థాపకుడు డా. ఎం. కతిర్ వెల్, జాతీయ డైరెక్టర్ డా. రేవతి ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ డా. ఎస్.కే. సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.






## డాక్టర్ శామ్యూల్‌కు ఘన సన్మానం

- జన్మదిన వేడుకల సందర్భంగా శాలువాలతో సత్కారం

మహబూబ్‌నగర్, మార్చి 22 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్ఎస్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ వైద్యులు డాక్టర్ శామ్యూల్‌కు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘన సన్మానం నిర్వహించారు. 40వ డివిజన్ కార్పొరేటర్ సిబీ శ్రీపూజిత శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సిబీ శ్రీపూజిత మాట్లాడుతూ డాక్టర్ శామ్యూల్ ఉమ్మడి జిల్లాలో ప్రముఖ వైద్యుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. గతంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారని కొనియాడారు. డాక్టర్ శామ్యూల్ కుటుంబ సభ్యులు కూడా వైద్య రంగంలో సేవలందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఆయన ఆ ప్రభువు కృపతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ కన్వీనర్ సిజే బెనహర్, టీఎస్ భాస్కర్, బి సన్నీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడిల టీచర్లకు కొత్త ఫోన్లు

కొల్లాపూర్ మార్చి 22 ప్రజా జ్యోతి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్లు ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉన్న సమాచారం మేరకు.

కొల్లాపూర్ నియోజక వర్గ మండల పరిధిలో ఉన్న గ్రామాలలో అంగన్వాడి టీచర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రజాపాలన ప్రభుత్వం ద్వారా గ్రామాలలో పనిచేస్తున్న అంగన్వాడి టీచర్లకు 4.జి బి.రామ్ సంసాంగ్ సెల్ ఫోన్ గతంలో ఉన్నది, కానీ పని భారం ఎక్కువ పడడం వలన ఫోన్ సపోర్ట్ చేయడం లేదని అంగన్వాడీ టీచర్లు ప్రభుత్వానికి కోరగా. మళ్లీ 64 జిబి మెమొరీ సామర్థ్యం ఉన్న ఫోను ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది, కొత్త ఫోన్లను గ్రామాలలో అంగన్వాడి



టీచర్లకు అందిస్తున్నట్టు ప్రభుత్వ సమాచారం. గ్రామాలలో అంగన్ వాడి కేంద్రాలలో రోజు ఫోన్లో పోషణ్ ట్రాక్టర్ యాప్లో 14 రకాల వివరాలు అప్డేట్ చేయాల్సి ఉంటుంది కాబట్టి గతలో ఉన్న ఫోన్ సపోర్ట్ అందించడం లేదని అన్నారు, వాటి స్థానంలో మళ్లీ టీచర్లకు కొత్త ఫోన్లు ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది, తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీలకు కొత్త ఫోన్లను ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది ఈ మేరకు 38 వేలకు పైగా సాంగ్ ఫోన్లను కొనుగోలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం సమాచారం. వీటిని పది రోజుల్లో అన్ని గ్రామాల అంగన్వాడి టీచర్లకు అందిస్తున్నట్టు ప్రభుత్వం సమాచారం.

## మోగులమల్లెపల్లి గ్రామంలో మెఘా క్రికెట్ టోర్నమెంట్

### ఈ నెల 27 నుండి ప్రారంభం కానున్న క్రికెట్ టోర్నీ

చింతపల్లి మార్చి 22(ప్రజాజ్యోతి)
శ్రీరామ నవమి జాతర సందర్భంగా చింతపల్లి మండలం మోదుగులమల్లెపల్లి గ్రామంలోని ఈ నెల 27 నుండి ఎం.పిఎల్ సీజన్ 01 క్రికెట్ టోర్నమెంట్ జరగనున్నట్లు ఆ గ్రామ సర్పంచి ముద్దం ముద్దం మల్లేష్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ క్రికెట్ శ్రీశ్రీశ్రీ కూర్మాచల సీతారామ చంద్ర స్వామి జాతర సబరాల్లో




భాగంగా జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తూన్నారు.నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏ మండలం జట్టు అయిన ఈ టోర్నీలో పాల్గొనవచ్చన్నారు.టోర్నీలో పాల్గొనాలి అనుకునే జట్లు ముందుగా 2000 వేలు ఎంట్రీ ఫీజ్ చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.టోర్నీలో విజయం సాధించిన జట్టుకు మొదటి బహుమతి రవిశంకర్ రెడ్డి (కుర్మపల్లి)50 వేల బహుమతి, ద్వితీయ బహుమతి 25 వేలు స్థానికి సర్పంచి ముద్దం మల్లేష్ అందజేయనున్నట్లు తెలిపారు.టోర్నీలో పాల్గొనాలి అనుకునే జట్లు ఆర్గనైజర్లు అబ్బయ్య 9000304430, సురేష్ 939894542,అనిల్ 6303197266 ఈ నంబర్లకు ఫోన్ చేసి ఎంట్రీ ఫీజ్ చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని కోరారు.ప్రతి మ్యాచ్ కి 10 ఓవర్లు, సెమి ఫైనల్ కి 12 ఓవర్లు కాగా ఫైనల్ మ్యాచ్ కి 15 ఓవర్లు కాగా ప్రతి జట్టు నియమనిబంధనల ప్రకారమే ఆడాలన్నారు.ఈ టోర్నీ దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు మోదుగులమల్లెపల్లి సర్పంచి ముద్దం మల్లేష్ తెలిపారు.

## ప్రజా సమస్యలపై పోరాడుతా..

నల్గొండ మార్చి 22 (ప్రజా జ్యోతి)
రాష్ట్ర ప్రభుత్వం అవాలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమ్ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు యార శ్రీను పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండలో ఏర్పాటు




చేసిన సమావేశంలో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన ఆ పార్టీ తెలంగాణా ఇంచార్జి ప్రియాంక కాక్కర్ కి , రాష్ట్ర కన్వీనర్ హేమాజీల్లోకి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాముగౌడ్ కి, జనరల్ సెక్రటరీ అన్సారీ కి ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. తనకిచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పైన పోరాడుతానని పేర్కొన్నారు. అదేవిధంగా పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలను భాగ్యస్వామ్యం చేస్తానని తనపై ఉంచిన నమ్మకాన్ని నిరంతరం ప్రజల పక్షాన నిలబడతానని అన్నారు. అదేవిధంగా తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

## ఉప సర్పంచ్ ల సంఘం జిల్లా అధ్యక్షులుగా వంగూరి అంజి యాదవ్.

నాగారం మార్చి 22 ప్రజా జ్యోతి.
ఉప సర్పంచుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా వంగూరి అంజి యాదవ్ నియమితులు అయ్యారు.ఆదివారం హైద్రాబాద్ లో జరిగిన ఉపసర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వంగూరి అంజి యాదవ్ ను నియమిస్తూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లావుడ్య రాములు



నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అంజి యాదవ్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో నన్ను జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ కు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు.జిల్లాలో ఉప సర్పంచుల సమస్యల పరిష్కరించడానికి పాటుపడతానని,ఉప సర్పంచుల సంఘం బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

నాంపల్లి,మార్చి,22(ప్రజా జ్యోతి)
:మండలంలోని సుంకిశాలకు చెందిన సీఎం సహాయ నిధి లబ్ధిదారులు బొమ్ము బక్కయ్య కు రూ. 9000 మరియు కొత్తగొల్ల వెంకటమ్మ కుమార్తె మావిళ్ళ మౌనిక– సైదయ్య లకు రూ. 36, 000 సీఎం సహాయనిధి చెక్కులను తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిది పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకిశాల గ్రామ మాజీ సర్పంచ్ భాషిపాక రామన్న, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## మరో సారి భువనగిరి ఎమ్మెల్యే గా కుంభం గెలుపు కొరకు కృషి చేస్తా

### నూతన డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ మజహార్ )

భువనగిరి,మార్చ్ 22 (ప్రజాజ్యోతి)భువనగిరి పట్టణం లోని వివేరా హోటల్ లొ పీసీసీ,కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశం లొ ముఖ్య అతిధిగా పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్బంగా యాదాద్రి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శిగా, ఎండీ మాజహార్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.ఈ నియామక పత్రాన్ని,పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,డీసీసీ అధ్యక్షులు,ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్,బీర్ల ఐల్లయ్య ఎంపీ,చామల కిరణ్ కుమార్ రెడ్డి,భువనగిరి ఎమ్మెల్యే కుంభం,అనిల్ కుమార్ రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకోవడం జరిగింది.ఈ సందర్బం గా డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండి మజహార్ మాట్లా డుతు కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్య,మంత్రి రేవంత్ రెడ్డి కి పీసీసీ,అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి,డీసీసీ అధ్యక్షు లు బిర్లా ఐలయ్య కి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు.అదే విధంగా భువనగిరి,అభివృద్ధి ప్రధాత కుంభం అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వం లో ఎల్లప్పుడు సేవజేస్తూ,జిల్లా లో కాంగ్రెస్ పార్టీ ప్రజ పాలన కార్య క్రమాలు,ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా ప్రభుత్వం బలుపేతంగా కృషి చేస్తానని



నియోజక వర్గంలో,కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే విధంగా అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వంలో రాబోయే రోజుల్లో, భువనగిరి అసెంబ్లీ స్థానాన్ని,మరోసారి గెలిపించే విధంగా కృషి చేస్తానని నాపై బాధ్యత అప్పగించిన కాంగ్రెస్ పార్టీ ని మరింత బలోపేతం చేసే నిబద్ధ నిబద్ధత గల క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచే స్తానని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా,ఈరోజు మహేష్ కుమార్ గౌడ్,చేతుల మీదుగా ప్రతి కార్యకర్త జిల్లా కార్యవర్గ నియమక పత్రాన్ని అందుకో వడం చాలా సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమం లొ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపురం గ్రామ అభివృద్ధి కి కృషి చేయండి

### మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు వినతి

### ఎప్పుడు తండ్రి కొడుకులు ఊరి అభివృద్ధి గురించి చెప్పడం

భువనగిరి,రూరల్ మార్చ్ 22 (ప్రజాజ్యోతి)భువనగిరి పట్టణం లోని వివేరా హోటల్ లొ డీసీసీ,కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి తెలంగాణప్రదేశ్,పీసీసీ,అధ్యక్షులు,మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు.వారికి స్వాగతం పలికి,పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి మర్యాద పూర్వకంగా,కలిసిన తిమ్మాపురం,గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి,భువనగిరి మాజీ,సింగిల్విండో చైర్మన్ ఎడ్ల సత్తి రెడ్డి ఈ సందర్బంగా తిమ్మాపురం,గ్రామ స్థులకు రావాల్సిన నిధులు ముఖ్య మంత్రి తో మాట్లాడి, మంజూరు చేయాలనీ అన్నారు.అదే విధంగా గ్రామ అభివృద్ధి కి తోడ్పాటు అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన బీసీసీ అధ్యక్షులు తండ్రి కొడుకులకు ఎప్పుడు కూడ అభివృద్ధి గురించి ఆలోచన చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. తప్పకుండా తిమ్మాపురం గ్రామ అభివృద్ధి కి సహకరిస్తానని ఇట్టి విషయాన్నీ,సీఎం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.



## బీసీలను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్

### తొందర్లోనే కర్రు కాల్చి వాత పెడతారు

### మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్

ఆలేరు మార్చి 22 ప్రజా జ్యోతి
బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తొందరలోనే కర్రు కాల్చి వాత పెడతారని మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ అన్నారు. చెప్పిన ప్రభుత్వం ఆ ఆమెని నిలబెట్టలేదన్నారు. సంవత్సరానికి 20వేల కోట్ల ఇస్తామని బీసీలకు 40 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించిన ప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఈ రిజర్వేషన్ అమలు అయితే విద్య వైద్య ఉద్యోగ రంగాల్లో బీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పి జాతీయ స్థాయిలో కూడా ప్రతిపాదన తీసుకెళ్తామని హామీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే నిర్వహించాన్నారు. ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలిచి చెప్పాలన్నారు. బీసీలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. 56% ఉన్న బీసీలను మోసం చేస్తుంది కాంగ్రెస్ పార్టీ కాదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, మాజీ చైర్మన్ శంకరయ్య, మున్సిపల్ కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్, మండల పార్టీ





ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో దొంతిరి సోమిరెడ్డి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలను మొదటి నుంచే మోసం చేస్తుందని అనిఆరోపించారు. బీసీల అభివృద్ధి కోసం లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయిస్తామని ఆచారంలోకి రాలేదన్నారు. బీసీ ప్రజాప్రతినిధులు ముఖ్యంగా మంత్రులు ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని చెప్పిన స్థానిక సంస్థల ఎన్నికలకు ఆ హామీ లేకుండానే నిర్వహించారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు ఇచ్చిన అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, మండల సెక్రెటరీ జనరల్ రచ్చ రామ్ నరసయ్య, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు మామిడాల భానుచందర్ , నాయకులు బాలస్వామి, పయాజు, బన్నీ, ఉప్పలయ్య, వెంకటేష్, ఉప్పలయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు

## రామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

నాంపల్లి, మార్చి 22 (ప్రజా జ్యోతి)
:మండల పరిధిలోని స్వాములవారి లింగోటం లో శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి ఆదివారం గ్రామ సర్పంచ్ ఏడుదొడ్ల



విజిత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సమక్షంలో దేవాలయ నూతన కమిటీనీ ఎన్నుకోగా, ఏడుదొడ్ల నర్సిరెడ్డి ని చైర్మెన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అతి పురతనమైన రామలింగేశ్వర స్వామి ఆలయం ఇక్కడి స్థల పురాణం ప్రకారం వందల ఏళ్ల క్రితం శంకరా చార్యులు ప్రతిష్టించిన లింగంగా,గతంలో అగ్రహారంగా ఉండేదని చెపుతారు. ఇలాంటి దేవాలయం నేడు శిథిలావస్థకు చేరింది. కొంత మంది దాతలు పలు మరమ్మత్తులు చేపించినా కానీ నూతన దేవాలయ నిర్మాణం కలగానే మిగిలిపోయింది.ప్రజల ఆకాంక్ష మేరకు మండల మాజీ ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత రవీందర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ ఏడుదొడ్ల విజిత ప్రభాకర్ రెడ్డి దేవాలయ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించుకొని అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. నూతన చైర్మెన్ నర్సిరెడ్డి మాట్లాడుతూ నా ఎన్నిక సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ కమిటీ లో ఉపాధ్యక్షుడిగా అమానగంటి నరసింహ రావు, ప్రధాన కార్యదర్శి గోపు యాదయ్య, కోశాధికారిగా మిరియాల రంజిత్ కుమార్, మారగోని శంకర్, కోన్ రెడ్డి ఏడుకొండలు, బెక్కం రమేష్, గోపు వెంకటయ్య, నల్లపు మల్లయ్య, పడగండ్ల శ్యామల, మారగొని యాదయ్య,కొమ్ము నరసింహ, జమలాపురి లక్ష్మయ్య,నల్లపూ సైదయ్య ,నల్లపు రాజశేఖర్ ,కీత హరినారాయణ,ఆవుల బక్కలయ్య,అంగిరేకుల పాండు, ఇరువెంటి లక్ష్మణ శర్మ,గడ్డి పుల్లయ్య,సురిగి నరసింహ, గండికోట వెంకటయ్య, తిరుమలేశ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఆయిల్ పామ్ రైతులకు బంగారు భవిష్యత్

భూదాన్ పోచంపల్లి, మార్చి 22 (ప్రజాజ్యోతి):
తెలంగాణలోని సిద్దిపేట జిల్లా నాంగ్నూర్ మండలం నర్మట్ట గ్రామంలో టీజీఓయిల్ఫెడ్ (తెలంగాణ ఆయిల్ ఫెడ్) ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం మరియు పామ్ ఆయిల్ రిఫైనరీ పునాది రాయి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. "ప్రజాపాలనలో – రైతు ఉత్సవాలు" కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని భూదాన్ పోచంపల్లి మండలం భీమనపల్లి రైతు వేదిక నుండి లైవ్ స్ట్రీమింగ్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, ఆధునిక ప్రాసెసింగ్ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలపై వివరించారు. ఈ తరహా ప్రాజెక్టులు తెలంగాణలో వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడడంతో పాటు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూదాన్ పోచంపల్లి మండలం నుండి సుమారు 150 మంది రైతులను ప్రత్యక్ష వీక్షణ కోసం పంపించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పి. వెంకటరమణ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎ. సైలజా రెడ్డి, ఏఈఓలు శ్వేత, ప్రియంక, స్వప్న, నరేష్, స్థానిక రైతులు మరియు వ్యవసాయ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేసి.. రైతు సంక్షేమ కార్యక్రమాలు వివరించిన సీఎం

### వీడియో కాన్ఫరెన్స్ వీక్షించిన ఎమ్మెల్సీ కె ఎస్ ఎన్,అధికారులు,రైతులు

మిర్యాలగూడ, మార్చి 22,( ప్రజాజ్యోతి ):
మిర్యాలగూడ మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో ఆదివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ



కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామం నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుభరోసా మొదటి విడత నిధులను విడుదల చేశారు. అనంతరం ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ ని ప్రారంభించారు అనంతరం రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మూడు విడతల్లో రైతు భరోసా రాష్ట్రంలోని రైతులందరికీ అందజేస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమా లను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం దూసుకుపోతుందన్నారు. నిధుల లేమితో కొద్దిగా లేట్ అయిన అనుకున్న హామీ ప్రకారం రైతు సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, జిల్లా రైతు కాంగ్రెస్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, ఇంచార్జ్ ఏ డి ఏ సైదా నాయక్, ఏఈఓ లు రమేష్,షఫీ, గోపి, జ్యోతి,అఫ్రీన్, పలు గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు,రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ మహేందర్ రెడ్డికి సన్మానం

రామన్నపేట మార్చి 22 (ప్రజా జ్యోతి)
ఇటీవల కాంగ్రెస్ పార్టీ డిసిసి నియామకాల్లో డిసిసి ప్రధాన కార్యదర్శిగా రామన్నపేట మండల వెల్లంకి గ్రామానికి చెందిన



తిమ్మాపురం మహేంద్ర రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండాల నరసింహ ఎన్నికై భువనగిరిలో ఉన్న వివేరా హోటల్ లో ప్రమాణ స్వీకారం చేశారు. వారికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నియామక పత్రం అందజేశారు. అనంతరం వారిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ జెడ్పిటిసి పున్న జగన్మోహన్,మాజీ సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, తాళ్లపల్లి సత్తిరెడ్డి,పూస బాలకిషన్, జినుకల ప్రభాకర్, గుత్త నర్సిరెడ్డి, శంభాల వెంకన్న తదితరులు శాలువాతో కప్పి సన్మానించారు.

## ఎమ్మెల్యే వేముల వీరేశం కు శుభాకాంక్షలు తెలిపిన నరసింహ చార్యులు



నార్కట్ పల్లి, మార్చి 22( ప్రజా జ్యోతి):
నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం కు తెలంగాణ ప్రభుత్వం శాసనసభ వీప్ పదవి వచ్చినందుకు నార్కట్పల్లి మండల కేంద్రం మాండ్ర గ్రామానికి చెందిన వేద పండితులు, పలు జిల్లా రాష్ట్ర, అంతర్జాతీయ అవార్డుల గ్రహీత ఉత్తర పల్లి నరసింహ చార్యులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్చా అని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొండ రమేష్ యాదవ్, గుండె రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అజ్మీర తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన...

అనంతగిరి మార్చి 22 (ప్రజాజ్యోతి):
అనంతగిరి మండలంఅజ్మీర తండా గ్రామంలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో సుమారు రూ.10 లక్షలతో సీసీ



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఆదివారం సర్పంచ్ అజ్మీరా శ్రీవిద్య బాలకృష్ణ శంఖుస్థాపన చేశారు.
సర్పంచ్ శ్రీవిద్య మాట్లాడుతూ, "ప్రతి గ్రామస్తుడుసౌకర్యవంతమైన రహదారులలో ప్రయాణించేందుకు సాధ్యమైనంత త్వరగా పునర్నిర్మాణం జరుగుతున్నది. తండా మొత్తం రహదారులు పునరుద్ధరించబడతాయిఅని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం తప్పనిసరి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అజ్మీర రమేశ్ బాబు, ఉపసర్పంచ్ కళ్యాణి సురేష్, మాజీ సర్పంచ్ సాగర్, మరియు వార్డు మెంబర్లు ప్రతాప్, బోడమ్మ, అలివేలు, బాలాజీ,సిబ్బంది సురేష్, పాల్గొన్నారు

## ఆరు గ్యారంటీల అమలుకి మూగబోయిన బడ్జెట్



**కామారెడ్డి ప్రతినిధి మార్చి 22. (ప్రజాజ్యోతి)** బిఆర్ఎస్ మాచారెడ్డి మండల శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకి ఆరు గ్యారంటీలాని అధికారం లోకి వస్తే అమలు చేస్తాము అన్ని నమ్మబాలికి, ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలని మోసం చేస్తున్నది అన్ని, రైతంగాన్నికి, విద్య రంగానికి,మహిళలకి,ఇలా అన్ని వర్గాలని కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తూ కాలయాపన చేస్తుంది అన్ని మాచారెడ్డి మండల అధ్యక్షులు పగడాల బాలచంద్రం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మూడు బడ్జెట్లు ప్రవేశ పెట్టిన ఇప్పటి వరకు ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్ కేటాయించకపోవడం శోచనీయం అని, ప్రజలకు సంక్షేమము, అభివృద్ధిలని పూర్తిగా దూరం చేసిహరోజుకో మాట పూటకో లెక్క మాట్లాడుతూ కాలయాపన చేస్తున్నది అని విమర్శించడం జరిగింది. రానున్న రోజులల్లో కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తు గా ఓడిపోవడం ఖాయం అని తెల్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు హంజీ నాయక్, శ్రీశైలం, సుదర్శన్ గౌడ్, మాజీ కో ఆప్షన్ అబ్దుల్ ఖాన్, మాజీ ఉప సర్పంచులు హేమ్లు నాయక్, తోకల కిషన్, మల్లేష్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాసంపల్లి రైతు వేదికల రైతు నేస్తం కార్యక్రమం

### – సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం ఆకట్టుకుంది



**కామారెడ్డి రూరల్ మార్చి 22 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలంలోని క్యాసం పల్లి క్లస్టర్ పరిధిలో గల క్యాసం పల్లి రైతు వేదిక ఆదివారం సందడి చేసింది. మధ్యాహ్నం 3:30 గంటలకు నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం రైతుల భారీ హాజరుతో విజయవంతంగా జరిగింది. దృశ్య–శ్రవణ మాధ్యమం (వీడియో కాన్ఫరెన్స్) ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడంతో గ్రామీణ ప్రాంత రైతులు కూడా ప్రభుత్వ కార్యక్రమాన్ని సమీపంగా వీక్షించే అవకాశం లభించింది. ఈ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి వర్చువల్‌గా పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రైతులకు కీలక నిర్ణయాలను ప్రకటించారు. ఆయన చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నిర్వహించడంతో పాటు రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ చర్యలతో రైతులకు ఆర్థిక భరోసా కలిగించడమే కాకుండా వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న కట్టుబాటును స్పష్టంగా తెలియజేశారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో మాట్లాడుతూ, రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభమని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ప్రతి సాయం ప్రభుత్వం అందిస్తుందని, సాగునీరు, విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్ సదుపాయాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు క్యాసం పల్లి క్యాసం పల్లి తండా రాఘవపూర్ నర్సన్న పల్లి గ్రామాలకు చెందిన రైతు క్యాసం పల్లి తండా సర్పంచ్ భూక్య శ్రీనివాస్ క్యాసం పల్లి ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి సోదరులు, సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రైతుల ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం అయిన కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షిస్తూ ముఖ్యమంత్రి ప్రసంగాన్ని శ్రద్ధగా వినిపించారు. ఈ సందర్భంగా ఏ ఓ పవన్ ఏఈఓ తేజస్విని మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు వేదికలు రైతులకు అవగాహన కల్పించే కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు గ్రామస్థులు పూర్తి మద్దతు తెలియజేశారు.

# నర్మెటలో రైతు ఉత్సవాలు

### – భారీగా తరలివెళ్లిన గాంధారి రైతులు



**గాంధారి, మార్చి 22 (ప్రజాజ్యోతి)** గాంధారి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల రైతులు ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్వహించిన రైతు ఉత్సవాల్లో భారీగా పాల్గొన్నారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి రాజలింగం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై రైతు భరోసా ఉత్సవాల్లో భాగంగా రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి చర్చలు జరిపి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించినట్లు అధికారులు తెలిపారు.రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ సహాయ పథకాలపై వివరాలు అందించేందుకు ఈ ఉత్సవాలు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాంధారి మండలానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇస్రోజీవాడి రైతు వేదికలరైతు నేస్తం కార్యక్రమం

### – సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం ఆకట్టుకుంది







**కామారెడ్డి రూరల్ మార్చి 22 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలంలోని అడ్లూరు క్లస్టర్ పరిధిలో గల ఇస్రోజీవాడి రైతు వేదిక ఆదివారం సందడి చేసింది. మధ్యాహ్నం 3:30 గంటలకు నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం రైతుల భారీ హాజరుతో విజయవంతంగా జరిగింది. దృశ్య–శ్రవణ మాధ్యమం (వీడియో కాన్ఫరెన్స్) ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడంతో గ్రామీణ ప్రాంత రైతులు కూడా ప్రభుత్వ కార్యక్రమాన్ని సమీపంగా వీక్షించే అవకాశం లభించింది. ఈ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు వర్చువల్‌గా పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రైతులకు కీలక నిర్ణయాలను ప్రకటించారు. ఆయన చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నిర్వహించడంతో పాటు రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ చర్యలతో రైతులకు ఆర్థిక భరోసా కలిగించడమే కాకుండా వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న కట్టుబాటును స్పష్టంగా తెలియజేశారు.ముఖ్యమంత్రి తన ప్రసంగంలో మాట్లాడుతూ, రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభమని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ప్రతి సాయం ప్రభుత్వం అందిస్తుందని, సాగునీరు, విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్ సదుపాయాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఇస్రోజీవాడి, వడ్లూర్, సరంపల్లి, టేక్రియాల్ గ్రామాలకు చెందిన రైతు సోదరులు, సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రైతుల ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం అయిన కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షిస్తూ ముఖ్యమంత్రి ప్రసంగాన్ని శ్రద్ధగా వినిపించారు. ఈ సందర్భంగా ఏఈఓ దేవేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు వేదికలు రైతులకు అవగాహన కల్పించే కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు గ్రామస్థులు పూర్తి మద్దతు తెలియజేశారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### – 5 గురు అరెస్ట్

### – 13,910 నగదు, 04 మోటార్ సైకిళ్లు, 5 సెల్ ఫోన్లు స్వాధీనం





**సదాశివనగర్, మార్చి 22 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలం లోని మర్కల్ గ్రామ పరిసర ప్రాంతంలో నమ్మకమైన సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించారు. అక్రమ జూదం (పేకాట) నిర్వహణ జరుగుతున్నట్లు తెలుసుకొని పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద గల నగదు 13,910 రూపాయల నగదు, 4 మోటార్ సైకిల్ 5 సెల్ ఫోన్లు ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎస్సై పుష్ప రాజ్. మాట్లాడుతూ మండల కేంద్రంలో వివిధ గ్రామాల పరిధిలో ఎలాంటి నిషేధిత ఆటలు ఆడడం గానీ ఆటలు ఆడడం వారిని ప్రోత్సహించడం గాని చేయరాదు అన్నారు. మీ గ్రామాలలో పేకాట ఆడుతున్నట్లు తెలిసిన అట్టి సమాచారాన్ని పోలీసు వారికి తెలియజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

## శ్రీ తపస్వి రామారావు మహారాజ్ ట్రస్ట్ స్వచ్ఛంద ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం







**గాంధారి, మార్చి 22 (ప్రజాజ్యోతి )** నిజామాబాద్‌లో శ్రీ జగదాంబ దేవి, శ్రీ సేవాలాల్ మహారాజ్, శ్రీ శ్రీ శ్రీ రామ్ రావు మహారాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాలధారణ చేపట్టిన మహారాజ్‌లకు ఆదివారం ఘనంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పౌరదేవి పీఠాధిపతి బాబు సింగ్ మహారాజ్, మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కమిషన్ డైరెక్టర్, ఎమ్మెల్సీ రాములు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.లబనా సమాజ్ అధ్యక్షుడు తాన్ సింగ్ ఆహ్వానం మేరకు పాల్గొని మహారాజ్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దీక్ష విరమణ సందర్భంగా భోగ్ బండారు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాలధారణలో ఉన్న మహారాజ్‌లు హారతి తీసుకుని దీక్షను విరమించారు.ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి మాలధారణ చేపట్టిన స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై బాబు సింగ్ మహారాజ్ ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ భక్తి కార్యక్రమాలు సమాజ ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. లబనా సమాజ్ అధ్యక్షుడు తాన్ సింగ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాలధారణ వేసుకున్న మహారాజ్ లు, బంజారా నాయకులు, కారోబార్లు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నిసార్లు చెప్పిన అధికారుల తీరు మాత్రం మారదు..?



**డోంగ్లి మండలం మార్చి 22 (ప్రజాజ్యోతి)** డోంగ్లి మండలం లింబూర్ గ్రామంలో ఎస్సీ కమిటి హాల్ వద్ద సమీపంలో ప్రధాన రహదారి పక్కన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో తవ్విన గుంత వాహనదారులకు శాపంగా మారింది. మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలేయడంతో నిత్యం జన సంచారం ఉండే ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి మరమ్మతులు చేసి గుంతను పూడ్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

### – బంగారం వెండి, నగదు అపహరణ



**నాగిరెడ్డిపేట్,మార్చి22(ప్రజాజ్యోతి):** తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన నాగిరెడ్డిపేట్ మండలంలోని ధీనూర్ గ్రామంలో చోటుచేసుకుంది.ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ధీనూర్ గ్రామానికి చెందిన బోయిని సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రంలో జరుగుతున్న నల్ల పోచమ్మ జాతరకు ఇంటికి తాళం వేసి వెళ్లారు.ఆదివారం వేకువ జామున ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉందని ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉందని తెలిపారు.గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో గల 6 మసాలా బంగారం,9 తులాల వెండి పట్టీలు,5 తులాల చేతి కడెం,2తులాల ఉంగరాలతోపాటు 20వేల నగదును దొంగిలించినట్లు సురేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు.సంఘటన స్థలానికి క్లూస్ టీం వారు సందర్శించి వేలిముద్రలను పరిశీలించినట్లు ఎస్సై తెలిపారు.సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అంగరంగ వైభవంగా నల్ల పోచమ్మ రథోత్సవం



**నాగిరెడ్డిపేట్, మార్చి22 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని నల్ల పోచమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేకువజామున రథోత్సవంను అత్యంత వైభంగా నిర్వహించారు. ఉగాది పండగ సందర్భంగా అమ్మవారికి మూడు రోజులపాటు జాతర ఉత్సవాలను నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం వేకువ జామున ఆలయ కమిటీ సభ్యులు, అమ్మవారి భక్తులు ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక పూజలు చేసి గా తీర్చిదిద్దున రథంపై అమ్మవారిని ప్రతిష్టించి, డప్పు సప్పులతో, పునకాలతో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.ఈ రథోత్సవంను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనంతో పరవశించిపోయి రథంను లాగారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## జక్రాన్‌పల్లి మండలంలో శిలాతీర్థ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**నిజామాబాద్ రూరల్: మార్చ్, 22 (ప్రజా జ్యోతి)** జక్రాన్ పల్లి మండలంలోని తొర్లికొండ గ్రామంలో గల శిలాతీర్థ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న రథయాత్రలో ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు ఆశీర్వచనాలు అందించాలని ఆలయ కమిటీ తరఫున ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కిరణ్ అనుపమ్, గ్రామస్థులు శ్రీనివాస్ గౌడ్, నల్ల గంగారెడ్డి, నర్సారెడ్డి, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 27న సాయిబాబా వేడుకలకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఈఓ ఆలయ అర్చకులు



**నిజామాబాద్ రూరల్: మార్చ్, 22 (ప్రజా జ్యోతి )** డిచ్‌పల్లి మండలంలోని మాధవ్ నగర్ సాయిబాబా ఆలయంలో ఈ నెల 27న నిర్వహించనున్న స్వామివారి జన్మోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ వేడుకలకు హాజరుకావాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని ఆలయ అర్చకులు మాణిక్య శర్మ, ఈఓ రవీందర్‌లు ఆహ్వానించారు.ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం శాలువాతో సన్మానించి వేడుకలకు విచ్చేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పాల్గొని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

# రిటైర్డు టీచర్ల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

– రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమగారి నాగిరెడ్డి




**తొగుట, మార్చి 22 (ప్రజా జ్యోతి):–** సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో ముఖ్యమంత్రి బహిరంగ సభ సందర్భంగా రిటైర్డ్ టీచర్లను ముందస్తు అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమగారి నాగిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేయడమేనని 2024 మార్చి నుండి రిటైర్మెంట్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిల కోసం గత రెండు సంవత్సరాలుగా అనేక నిరసన కార్యక్రమాలు చేస్తూ ప్రభుత్వం మీద తీవ్ర ఒత్తిడి తెచ్చినప్పటికీ ఫలితం లేదని రిటైర్మెంట్ అయినా ఉద్యోగికి నయా పైస చెల్లించకుండా పెన్షన్ మాత్రమే ఇస్తున్నారని, ఈ సమస్య మీద అనేక పోరాటాలు జరిగాయని పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టులు చేసిన ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో పెన్షనర్ల బకాయిల చెల్లింపు కోసం బడ్జెట్ కేటాయించకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికే పెన్షన్ బకాయిలు రాక 83 మంది రిటైర్డ్ ఉద్యోగులు అసువులు బాశారన్నారు. పెన్షనర్ల పట్ల ప్రభుత్వానికి ఇసుమంతైన కనికరం లేకపోవడం శోచనీయమని నాగిరెడ్డి వాపోయారు. ఇప్పటికైనా రిటైర్డ్ ఉద్యోగుల బాధల పట్ల ప్రభుత్వం స్పందించి పెన్షన్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# బందారం గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

– ఎంపీ రఘునందన్ రావు



**కొండపాక మార్చి 22( ప్రజా జ్యోతి ):–** కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ రఘునందన్ రావుకు మండలంలోని బందారం గ్రామ స్థానిక బిజెపి నాయకులతో పాటు గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నర్మెట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్తున్న ఎంపీ రఘునందన్ రావు బందారం గ్రామంలో కొద్దిసేపు కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలు గ్రామస్తులు రఘునందన్ రావు దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. బందారంతో పాటు సుమారు 6 గ్రామాల ప్రజలకు సాగునీరు అందక రైతులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని సాగునీటి కాలువ నిర్మాణం కోసం ప్రణాళికలు ఉన్నప్పటికీ చేయడం లేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గ్రామంలో ఐమాక్స్ లైట్లు వేయాలని, అంగన్ వాడి భవనాన్ని నిర్మించాలని ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. దాంతో రఘునందన్ రావు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎంపీ వెంట జిల్లా అధ్యక్షుడు శంకర్ మండల అధ్యక్షుడు నీల సత్యం వార్డు సభ్యుడు నీల వెంకటేశం తదితరులు ఉన్నారు.

# తలంబ్రాలు అందజేసిన బాలాజీ దేవాలయం

– భద్రాచలానికి దుబ్బాక నుండి కదిలిన గోటి తలంబ్రాలు

– రామకోటి రామరాజు అందజేత



**దుబ్బాక ప్రతినిధి, మార్చి 22 (ప్రజా జ్యోతి)** భద్రాచల రామయ్య కళ్యాణానికి దుబ్బాక బాలాజీ దేవాలయం నుండి గోటి తలంబ్రాలను శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు అందించారు. ఈ సంవత్సరం 3 క్వింటాల్ల గోటి తలంబ్రాలు అందించాలన్న సంకల్ప దీక్షతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రామనామ స్మరణ చేయించి గోటి తలంబ్రాలు సిద్ధం చేపిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం నాడు దుబ్బాక మరియు వివిధ గ్రామాల నుండి వచ్చిన గోటి తలంబ్రాలకు ప్రత్యేక పూజలు జరిపి బాలాజీ దేవాలయం ప్రతినిధులు రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ సందర్బంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ... భక్తితో ప్రతి భక్తుడు కూడా మేము భద్రాచలం వెళ్లలేక పోయిన కూడా మేము ఓలిచిన తలంబ్రాలు రామయ్య కళ్యాణానికి చేరడం ఎన్నో జన్మల పుణ్యమో అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు అచ్చి లక్షి నర్సింహా ఆచార్య, ఆలయ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, కమిటీ సభ్యులు చింత నాగేందర్ , నల్ల శ్రీనివాస్ రొట్టె రాజమౌళి బొమ్మెర నాగభూషణం సిబి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కండేయలుకు ఉగాది సేవా పురస్కారం




**సిద్దిపేట, మార్చి 22(ప్రజాజ్యోతి):–** చేనేత ఐక్యవేదిక సిద్దిపేట జిల్లా సలహాదారులు,పద్మశాలి సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ గోనె మార్కండేయులుకు ఆయా రంగాల్లో రాణిస్తున్నందుకు ఉగాది సేవా పురస్కారం లభించింది.తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ పురస్కారాలు ప్రకటించి ఆదివారం ప్రధానం చేశారు.హైదరాబాదులోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీమంత్రి బాబు మోహన్,చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్ చేతుల మీదుగా మార్కండేయులు అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురస్కారం దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.పద్మశాలీలు,చేనేత కార్మికుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. పురస్కారానికి ఎంపిక చేసిన చేనేత ఐక్యవేదిక పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

# జల మహోత్సవంతో మిషన్ భగీరథ నీటిపై అవగాహన







**కొమురవెల్లి, మార్చి 22 (ప్రజా జ్యోతి):–** మండలంలోని రాసులబాద్ గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల అనుష స్వామి గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో జల మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ పుట్ట వెంకటరెడ్డి, డీఈ కె. నర్సింలు, డీఈ వి. యాదగిరి, ఏఈ దివ్య, ఎంపీఓ శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు తాగడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఆర్ఓ వాటర్, మిషన్ భగీరథ నీరు, గ్రామాల్లోని బోర్‌వాటర్‌లపై పరీక్షలు నిర్వహించి ఏ నీరు మంచిదో ప్రజలకు అవగాహన కల్పించారు. మిషన్ భగీరథ నీటిలో ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయని, ఆర్ఓ నీటిలో రసాయనాలు ఉండే అవకాశం ఉందని వివరించారు. ఆర్ఓ నీటిని అధికంగా వినియోగిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.గ్రామ ప్రజలు మిషన్ భగీరథ నీటిని వినియోగించాలని, నీటిని వృథా చేయవద్దని సూచించారు.సర్పంచ్ అనుష స్వామి గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో మిషన్ భగీరథ నీటి వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సిద్దిపేట జిల్లాలో తమ గ్రామంలో జల మహోత్సవం నిర్వహించి, మిషన్ భగీరథపై అవగాహన కల్పించిన జిల్లా అధికారులకు గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్, మాజీ సర్పంచ్ స్వామి గౌడ్, వార్డు సభ్యులు మల్లేశం, బొద్దూర్ మంజుల, లక్ష్మి, పరశురాములు, శ్రీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి బాలనర్స్, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో హామీలకు మొండిచేయి

– మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి



**తొగుట, మార్చి 22(ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ప్రజలకు మొండి చేయి చూపించిందని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. మార్పు రావాలంటే కాంగ్రెస్ రావాలని, 6 గ్యారంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి గద్దె నెక్కి ప్రజలను మోసం చేశారన్నారు. రైతన్నలకు దగా చేశారని, 15 వేల రైతుభరోసా, 500 పంటల బోనస్, కౌలు రైతులకు, రైతు కూలీలకు రైతు భరోసా దోకా చేశారన్నారు. కెసిఆర్ హయాంలో నిర్మించిన మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్ట్ కు సంబంధించి దుబ్బాక నియోజకవర్గం లో ఉప కాలువల నిర్మాణం కు బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. మహిళలకు 2500 గ్యారెంటీ, కళ్యాణ లక్ష్మి లో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీల ఊసే లేదన్నారు. విద్యార్థి యువతకు 4 వేల నిరుద్యోగ భృతి ఎగవేతతో పాటు 2 లక్షల ఉద్యోగాలను ఎగవేశారన్నారు. 5 లక్షల విద్యాభరోసా కార్డు ఎగవేసారన్నారు. బీసీలకు లక్ష కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు అంబేద్కర్ అభయ హస్తం ద్వారా 12 లక్షలు లేనే లేవన్నారు. ఎస్సీ ఎస్టీలకు 70 శాతం నిధుల కోత విధించారని, మైనారిటీల సంక్షేమానికి మంగళం పాడారన్నారు, ఆసరా పింఛన్ ల పెంపు మరిచారన్నారని, ప్రభుత్వం లో ఆర్టీసీ విలీనం, ఆటో డ్రైవర్లకు 12 వేల సాయం, అంగన్ వాడీలకు, ఆశావర్కర్లకు జీతం పెంపు పై మోసం చేశారన్నారు. ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులకు ధోకా చేశారని, డీఏల పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్ల ఊసే లేదని, పాత పెన్షన్ విధానం ప్రస్తావన లేదని ఆయన విమర్శించారు. ఆరు గ్యారెంటీలకు, డిక్లరేషన్లకు పాతరేసి, సంక్షేమ పథకాలకు సమాధి కట్టారని విమర్శించారు.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ప్రజలకు మొండి చేయి చూపించిందని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. మార్పు రావాలంటే కాంగ్రెస్ రావాలని, 6 గ్యారంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి గద్దె నెక్కి ప్రజలను మోసం చేశారన్నారు. రైతన్నలకు దగా చేశారని, 15 వేల రైతుభరోసా, 500 పంటల బోనస్, కౌలు రైతులకు, రైతు కూలీలకు రైతు భరోసా దోకా చేశారన్నారు. కెసిఆర్ హయాంలో నిర్మించిన మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్ట్ కు సంబంధించి దుబ్బాక నియోజకవర్గం లో ఉప కాలువల నిర్మాణం కు బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. మహిళలకు 2500 గ్యారెంటీ, కళ్యాణ లక్ష్మి లో తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీల ఊసే లేదన్నారు. విద్యార్థి యువతకు 4 వేల నిరుద్యోగ భృతి ఎగవేతతో పాటు 2 లక్షల ఉద్యోగాలను ఎగవేశారన్నారు. 5 లక్షల విద్యాభరోసా కార్డు ఎగవేసారన్నారు. బీసీలకు లక్ష కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు అంబేద్కర్ అభయ హస్తం ద్వారా 12 లక్షలు లేనే లేవన్నారు. ఎస్సీ ఎస్టీలకు 70 శాతం నిధుల కోత విధించారని, మైనారిటీల సంక్షేమానికి మంగళం పాడారన్నారు, ఆసరా పింఛన్ ల పెంపు మరిచారన్నారని, ప్రభుత్వం లో ఆర్టీసీ విలీనం, ఆటో డ్రైవర్లకు 12 వేల సాయం, అంగన్ వాడీలకు, ఆశావర్కర్లకు జీతం పెంపు పై మోసం చేశారన్నారు. ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులకు ధోకా చేశారని, డీఏల పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్ల ఊసే లేదని, పాత పెన్షన్ విధానం ప్రస్తావన లేదని ఆయన విమర్శించారు. ఆరు గ్యారెంటీలకు, డిక్లరేషన్లకు పాతరేసి, సంక్షేమ పథకాలకు సమాధి కట్టారని విమర్శించారు.

### ఐఎంఎల్ కార్మికుడు
# కుటుంబాన్ని పరామర్శించిన బీఎంఎస్

– ఎక్స్ గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలి – ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి డిమాండ్

**కొల్చారం (మెదక్ ): మార్చి 22 :** మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనాపూర్‌కు చెందిన నాగం నగేష్ శనివారం నాడు కొల్చారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల బీఎంఎస్ తెలంగాణ స్టేట్ కన్స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి పి. మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి మరియు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం నాడు చిన్నఘనాపూర్‌లో జరిగిన నగేష్ అంత్యక్రియలలో పాల్గొని నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఐఎంఎల్ డిపోలో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి భద్రత, ఆధారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దశాబ్దాల కొద్దీ వారిచేత వెట్టిచాకిరీ చేయించుకుని, కనీస సామాజిక భద్రత, ఈఎస్ఐ , పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించకపోవడం అత్యంత శోచనీయం అని విమర్శించారు. మరణించిన కార్మికుడు నగేష్ కుటుంబానికి ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే స్పందించి తగిన ఎక్స్ గ్రేషియా (నష్టపరిహారం) చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కారుణ్య నియామకం కింద వారి కుటుంబంలో ఒకరికి వెంటనే ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిఎం ఎస్ అధ్యక్షులు వడ్ల నర్సింలు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తోట నరసింహారెడ్డి ,ఐఎంఎల్ డిపో యూనియన్ కార్యవర్గ సభ్యులు, కార్మికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# బాధిత కుటుంబాన్ని పరామర్శ



**దుబ్బాక మార్చి 22 (ప్రజా జ్యోతి)** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంఘం ప్రభాకర్ కుటుంబాన్ని ఆదివారం రోజున తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ పరామర్శించారు. ప్రభాకర్ తండ్రి రాజయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు శుక్రవారం మరణించాడు. విషయాన్ని తెలుసుకున్న గుర్రాల శ్రీనివాస్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతిని ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత ఆస ముత్యం, ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కుంబాల రవీందర్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# కాళేశ్వరం నీటితో 'కృత్రిమ' ఇసుక దందా!





– పగలు నిఘా.. రేయి అక్రమ తయారీ

– అధికారుల కళ్లుగప్పి ఇసుక శుద్ధి..

– 3 పువ్వులు,6 కాయలుగా వ్యాపారం.!

**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** ప్రభుత్వ సంపదను కొల్లగొట్టడంలో అక్రమార్కులు సరికొత్త పంథా అనుసరిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన చోట పాతరేస్తూ, అధికార యంత్రాంగం కళ్లుగప్పి చాకచక్యంగా తమ తెలివితేటలను ప్రదర్శిస్తున్నారు. మండలంలోని మహ్మదాబాద్ ప్రవాహక ప్రాంతాన్ని అడ్డాగా మార్చుకున్న అక్రమార్కులకు.. 'కాళేశ్వరం' ప్రాజెక్టు నీరు వరంగా మారింది. గతంలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టు నీరు నిండుకుండలా మారడంతో, ఆ జలాలను ఉపయోగించి కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**చీకటి సామ్రాజ్యం.. తెల్లవారితే శుద్ధి!**

వీరి తెలివితేటలు ఏ స్థాయిలో ఉన్నాయంటే.. మూడో కంటికి తెలియకుండా ఈ దందాను నడిపిస్తున్నారు. తెల్లవారుజామున చీకటి ఉండగానే ఇసుక తయారీ ప్రక్రియను ముగించేస్తున్నారు. సూర్యోదయం అయ్యే సమయానికి నీటితో ఇసుకను శుద్ధి చేసి, గుట్టలుగా పోస్తున్నారు. ఎవరూ గుర్తించకముందే రోజుకు కనీసం రెండు ట్రిప్పుల చొప్పున ఇసుకను తరలిస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం అధికారుల సంచారం ఉన్నప్పటికీ, అక్రమార్కుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. అధికారుల నిఘా లోపమో లేక పరోక్ష సహకారమో తెలియదు కానీ, అక్రమార్కులు ఏమాత్రం భయం లేకుండా ఈ 'కృత్రిమ' వ్యాపారాన్ని సాగిస్తున్నారు. స్థానికులు, పర్యావరణ ప్రేమికులు మొత్తుకుంటున్నా క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం.

**ఆట కట్టించాల్సిందే!**

ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతూ, పర్యావరణానికి ముప్పు తెస్తున్న ఈ అక్రమ ఇసుక దందాను అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి ఈ చీకటి వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

### ప్రజావాణిని
# సద్వినియోగం చేసుకోండి



**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం 10:30 గంటలకు నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మార్వో శ్రీనివాస్ కోరారు. సమస్యలున్న వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నేరుగా తనను కలిసి వినతిపత్రాలు అందజేయవచ్చన్నారు. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, అర్జీలను త్వరితగతిన పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# సైబరాబాద్‌లో వీకెండ్-స్పెషల్ డ్రంక్ డ్రైవ్ 173 మందిపై కేసులు

## – సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి రంజన్ రతన్ కుమార్



**శేరిలింగంపల్లి, మార్చ్ 22 (ప్రజాజ్యోతి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి × రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 173 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 138 ద్విచక్ర వాహనదారులు, 10 ఆటోలు, 22 కార్లు, 03 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఏసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే---145 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 15 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, 13 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (16.03.2026--21.03.2026) లో మొత్తం 358 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో00 మందికి జరిమానా, జైలు శిక్ష, 02 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 356 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంల పాల్గొన్న రవికుమార్ యాదవ్






**శేరిలింగంపల్లి, మార్చ్ 22 (ప్రజాజ్యోతి):** స్వాతంత్ర సమరయోధులు, దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా స్టీఫెన్ వారి సన్నిహితుల ఆధ్వర్యంలో పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ దేశం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ వర్ధంతి ఇంత ఘనంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని, భగత్ సింగ్ లాంటి వారు చేసిన ప్రాణ త్యాగల ఫలితమే మనం ఆస్వాదిస్తున్న స్వాతంత్రం అని అన్నారు, ఆయన జీవితం మన ప్రధాని మోదీ కి ,మాలాంటి ఎంతో మంది నాయకులకు స్ఫూర్తి అని, మనం కూడా ఆయన స్ఫూర్తి తో దేశం కోసం దేశా అభివృద్ధి కోసం మనం కూడా ఎంతో కొంత మన బాధ్యతలను నిర్వహించాలన్నారు. ఆదివారం రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేసి, సంవత్సరంలో కనీసం ఒకటి రెండు సార్లైన బ్లడ్ డొనేట్ చేయాలని దీని వలన కొత్త రక్తం ఉత్పత్తి అయ్యి మనం కూడా చాలా ఆరోగ్యంగా ఉంటామన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అర్జున్, స్టీఫెన్, ప్రభాకర్, శివ, బంటి, మరియు వారి సన్నిహితులు పాల్గొన్నారు.

# ప్రతి హామీని నెరవేర్చుతాం

- మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా
- రామాలయం ముందు సొంత నిధులతో సిసి రోడ్డు పనులు ప్రారంభం



**చేవెళ్ల, మార్చి 22 (ప్రజా జ్యోతి) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేర్చుతామని దామరగిద్ద మాజీ సర్పంచ్, సర్పంచుల సంఘం రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు రెడ్డిశెట్టి మధుసూదన్ గుప్తా పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ 9వ వార్డులో రామాలయం ముందు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్వంత నిధులతో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బందారి శైలజా ఆగిరెడ్డి, తాళ్లపల్లి నర్సింలు, మంగలి కల్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మలిపెద్ది వెంకటేశం గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదన్ గుప్త మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి సహకారంతో వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బ్యాగరి రాములు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# తాండూరు బిఆర్ఎస్‌ను నడిపించే లీడరెవ్వరు!

- డ్రగ్స్ కేసులో జైలు కెళ్ళిన మాజీ ఎమ్మెల్యే
- నాయకత్వ లోపంతో ఇరుక్కుపోతున్న నాయకులు
- పార్టీ ఇంచార్జి బాధ్యతలు చేపట్టేదెవ్వరు!
- రోహిత్ రెడ్డి పై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోనుందా?



**తాండూరు మార్చ్ 23 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లాలోనే తాండూర్ నియోజకవర్గంలో మంచి పట్టున్న బిఆర్ఎస్ పార్టీ కష్టాల్లో ఇరుక్కుపోయింది. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ అభయమిచ్చే నాయకుడే డ్రగ్స్ కేసులో ఇరుక్కుపోతే ఎలా ఉంటుందో స్పష్టంగా అర్థమవుతుంది. ఇప్పటివరకు తాండూర్ నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా ముందుకెళ్లిన పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో ఇరుక్కుపోయి కార్యకర్తలకు షాకిచ్చారు. తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీలోనే అత్యంత కీలకమైన నాయకుడిగా ముందుకు వెళ్తున్నారనే నమ్మకంతో కార్యకర్తలు కూడా ఉత్సాహంగా ఉండేవారు. ప్రస్తుతం డ్రగ్స్ కేసులో జైలు కు వెళ్లిన రోహిత్ రెడ్డి స్థానాన్ని భర్తీ చేయడం కోసం సరైన నాయకుడు లేకపోవడంతో నాయకత్వ లోపం పూర్తిగా లోపించిందని చెప్పొచ్చు. తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాలలో బిఆర్ఎస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ అసలైన నాయకుడు చిక్కుల్లో పడడంతో ఊపిరి సల్పని స్థితిలో కార్యకర్తలు ఉన్నారనే సందేశాలు వెలువెత్తుతున్నాయి. ఆయా మండలాలలో సర్పంచ్లుగా గెలుపొందిన వారు ఏ సమస్య వచ్చినా పైలట్ రోహిత్ రెడ్డి ఉన్నాడనే ధీమా వారిలో ఉండేది. ప్రస్తుతం అదే నాయకుడు డ్రగ్స్ కేసులో ఇరుక్కుపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని సంకట స్థితిలో కార్యకర్తలు పడిపోయారు. రోహిత్ రెడ్డికి వెన్నుదన్నుగా ఉన్న నాయకులెవ్వరు కూడా కార్యకర్తలకు అభయమిచ్చే స్థాయిలో కనిపించడం లేదు. బిఆర్ఎస్ పార్టీ తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జిగా ఎవరికి బాధ్యతలు అప్పగిస్తారో వేచి చూడాల్సిందే. మొయినాబాద్ సమీపంలోని ఫామ్ హౌస్ ఘటనలో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో ఉన్నాడని జైలు కూడ వెళ్ళాడనే పూర్తి సమాచారం ఉన్నప్పటికీ కూడా జిల్లా పార్టీ అధ్యక్షుడు నోరు మెదపకపోవడం కూడా ఓ విధంగా తాండూరు బిఆర్ఎస్ ఇన్చార్జి బాధ్యతల్లో మార్పు ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

# కిషన్ ప్రసాద్ జ్ఞాపకార్థం వాలిబాల్ టోర్నమెంట్ సీజన్- 2 విన్నర్‌కు రూ 25000-రన్నర్‌కు రూ 15000

## – వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన సొసైటీ మాజీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్





**బషీరాబాద్ మార్చి 22 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో స్టేషన్ వెనకాల సిపిఎస్ స్కూల్ నందు ఆదివారం కీ.శే. పి. కిషన్ ప్రసాద్ జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నమెంట్ సీజన్ 2 ను సొసైటీ మాజీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగావారు మాట్లాడుతూ మా తండ్రి పి కిషన్ ప్రసాద్ జ్ఞాపకార్థం సందర్భంగా ఈ వాలిబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు ఈటోర్నమెంట్లో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. విజేత జట్టుకు విన్నర్ ప్రైస్ 25 వేల రూపాయలు, రన్నర్ ప్రైస్ 15000 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు క్రీడలు యువతలో క్రమశిక్షణ ఐక్యత పెంపొందిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు జానకి, ఏఎంసి వైస్ చైర్మన్ చందర్ నాయక్, ఏఎంసీ డైరెక్టర్ అనుప్, ఆర్ఎంపీ డాక్టర్ నర్సింలు, శ్రీకాంత్ , హనుమంతు శంకర్ ప్రసాద్, వేదం, సేవ్య నాయక్, రాము, నరేష్, జగదీష్ షేక్ సైబన్, అస్లాం, క్రీడాకారులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం తాండూర్ పట్టణ శాఖ ఏర్పాటు



- నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం
- సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తా
- ఆర్బిఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి
- మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి

**తాండూరు మార్చ్ 23 ప్రజా జ్యోతి :** తాండూరు పట్టణ శాఖ రజక సంఘం నూతన కార్యవర్గం అధ్యక్షులుగా రాజు, గౌరవ అధ్యక్షులుగా విశ్రాంత ఉద్యోగి (మాజీ సబ్ రిజిస్టర్) ఆర్ నర్సిములు, ప్రధాన కార్యదర్శిగా శాంతు కుమార్ లను రజక సంఘం పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తాండూరు పట్టణం చెన్గేష్ పూర్ రోడ్డు మార్గంలోని కింగ్ ప్యాలాస్ పంక్షన్ హాల్ నందు రజక సంఘం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ఆర్ బి ఓ ఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి, తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సిములు(బొట్టు), మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, తెలంగాణ రాష్ట్ర రజక సంఘం జేఏసీ అధ్యక్షుడు పంజా గారి ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం అధ్యక్షులు గౌరవ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి, ఇతర సభ్యులచే ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్ష కార్యదర్శులను శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రజక సంఘం అభివృద్ధి కోసం అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో రజక కమ్యూనిటీ కోసం నూతనంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం, దోబిఘాట్ కు ప్రహరీ గోడ, అదేవిదంగా ప్రస్తుతం ఉన్న దోబీ ఘాటును ఆధునికరించడం వంటి అభివృద్ధి పనులతో పాటు,అక్కడ నీటి సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు అని విధాల సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాములు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మోహన్, అసోసియేట్ అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు నాగప్ప, తాండూర్ నియోజకవర్గం అయినెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్, కోశాధికారి సిహెచ్ రాములు చంద్రయ్య రమేష్ రజక సంఘం ప్రతినిధులు కృష్ణ, రవి, రమేష్ తదితరులున్నారు.

# ప్రాణాలకు పొంచి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- నడిరోడ్డుపై వేలాడుతున్న వైర్లు భయం గుప్పెట్లో అడల్పూర్ గ్రామం
- విద్యుత్తుపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు
- గతంలో విద్యుత్ షాక్‌తో ఇద్దరు వ్యక్తులు మృతి
- తీరుమారని విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆగ్రహం
- దీనిపై పూర్తిగా వార్త రూపంలో కావాలి
- నడిరోడ్డుపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- అడల్ పూర్ గ్రామంలో ప్రాణాలకు ముప్పు







**యాలాల్ మార్చి 22 ప్రజా జ్యోతి :** యాలాలమండల పరిధిలోని అడల్ పూర్ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నడిరోడ్డుపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు గ్రామస్తులకు తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొనడంతో గ్రామస్థులు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానమైన విద్యుత్ తీగలు చాలా దిగువగా వేలాడుతూ ఉండటం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, వాహనదారులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో విద్యుత్ షాక్ కారణంగా ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం మాత్రం తగ్గలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే మరిన్ని ప్రాణనష్టాలు సంభవించే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. తక్షణమే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేసి, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పంచాయతీ కార్మికుడు బైండ్ల రాములు మృతి

## – ఆర్థిక సహాయం అందించిన గ్రామ సర్పంచ్ సిహెచ్ శివయ్య



**యాలాల (మార్చ్ 22) ప్రజాజ్యోతి :** యాలాల మండలకేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా గ్రామపంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న బైండ్ల రాములు మృతి చెందడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సిహెచ్ శివయ్య అంత్యక్రియలు నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. గ్రామపంచాయతీలో పనిచేసి మృతి చెందడం గ్రామానికి సేవ చేసిన వ్యక్తిని మర్చిపోవాలంటే ఎంతో బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోనె శ్రీనివాస్ గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వార్డు సభ్యులు బాలు అశ్విని జిలాని లింగంపేట్ సురేష్ గడ్డం బసవరాజు గౌడ్ రమేష్ పాపయ్య గ్రామపంచాయతీ సిబ్బంది షబ్బీర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 6 గ్యారెంటీలపై నిధులు సున్నా...

## కాంగ్రెస్ హామీలు గాలికే : మహేష్ రెడ్డి విమర్శలు



**పరిగి, మార్చి 22 (ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన “6 గ్యారెంటీలు” అమలు విషయంలో పూర్తిగా విఫలమైందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పరిగి పట్టణం లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి నేడు ఆ హామీలను గాలికి వదిలేసి ప్రజలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. గడిచిన రెండున్నర సంవత్సరాల్లో 6 గ్యారెంటీల అమలుకు తగిన నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటని మహేష్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో మోసపూరిత పరిపాలన కొనసాగుతోందని, ఇప్పటికే నిర్మించిన ఇళ్లను కూల్చడం వంటి చర్యలతో ప్రజల జీవితాలను దెబ్బతీస్తోందని ఆయన అన్నారు. రైతాంగం కూడా ప్రభుత్వ విధానాల వల్ల ఇబ్బందులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా రెండేళ్లలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మహేష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు.

# దశాబ్దాల కల నెరవేర్చిన బీటీ రోడ్డు

## – ఆడల్‌పూర్ గ్రామంలో ఆనందం



**యాలాల్ మార్చు 22 ప్రజా జ్యోతి :** దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బీటీ రోడ్డు నిర్మాణం ఆడల్‌పూర్ గ్రామ ప్రజల కలను నెరవేర్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, మౌలిక వసతుల కల్పనలో ముందడుగు వేస్తున్న నేపథ్యంలో ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. అదనంగా గ్రామంలో సీసీ రోడ్లు కూడా ఏర్పాటు చేయడం వల్ల గ్రామానికి కొత్త శోభ చేకూరిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పూర్వ పాలకులు పట్టించుకోలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వారు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ,ఎమ్మెల్యే సహకారంతో మా గ్రామానికి బీటీ రోడ్డు రావడం మా అదృష్టమని,ఏళ్ల నాటి కల నెరవేరిందని అన్నారు. గ్రామానికి రవాణా సౌకర్యం మెరుగుపడడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయని తెలిపారు. ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# నిరుపేద ఆడపిల్ల వివాహానికి ఉప్పల ట్రస్ట్ చేయూత



**తలకొండపల్లి మార్చ్22 (ప్రజాజ్యోతి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని గడ్డమీది తాండ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బాణావత్ లక్ష్మణ్ కూతురు బాణావత్ పూజ వివాహానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తమ ట్రస్ట్ ద్వారా 2క్వింటాల బియ్యం గ్రామ మాజీ సర్పంచ్ ఈశ్వర్ నాయక్, సేవాలాల్ మండల యూత్ అధ్యక్షుడు చక్రు నాయక్ ద్వారా బాణావత్ లక్ష్మణ్‌కు 2క్వింటాల బియ్యం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సహాయం పొందిన నిరుపేద కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆమనగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ పాపిశెట్టి రాములు తమదైన శైలిలో రూ. 4వేల రూపాయలు పేదింటి వివాహానికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కిసాన్ నాయక్, శ్రీను నాయక్, రాంపూర్ వార్డు సభ్యులు కాకి రామచంద్రయ్య, నాయకులు సంపత్ కుమార్, కాకి శ్రీశైలం తదితరులున్నారు.

# కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామానులు దగ్ధం





**సత్తుపల్లి మార్చి22(ప్రజా జ్యోతి)** మండల పరిధి లోని బేతుపల్లి ఎస్టీ కాలనీలో శనివారం రాత్రి కరెంట్ షార్ట్ సర్క్యూట్ వలన ఇంట్లో సామాను మొత్తం కాలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడం వల్ల ఎటువంటి ప్రాణం నష్టం జరగలేదు. కరెంట్ డిపార్ట్మెంట్ పరిశీలించారు. గ్రామ సర్పంచ్ దొడ్డ రాజేంద్రప్రసాద్ ( అమ్ములు బాబు) మాట్లాడుతూ ఎండాకాలం కావడంతో వడ్డంగి అశోక్ శనివారం సాయంత్రం సమయంలో ఇంటి పైన పడుకున్నసమయంలో , ఇంట్లో షార్ట్ సర్క్యూట్ వల్ల సుమారు రూ.. 50 వేల రూపాయల పైనే నష్టం జరిగిందని, అశోక్ చాలా పేదవాడని, కరెంట్ డిపార్ట్మెంట్ వారు, ప్రభుత్వం, ఇంకా ఎవరైనా పెద్ద మనసుతో నా ఆర్థిక పరిస్థితి గమనించి,సహాయ సహకారాలు అందించాలని కోరినారు.

### మృతుడు బాబురావు కుటుంబానికి

# ఆర్థికసాయం అందజేసిన సర్పంచులు



**కారేపల్లి, మార్చి 22, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలో ని పాత కమలాపురం సర్పంచ్ తేజవత్ బాబురావు ఇటీవల గుండెపోటుతో మరణించినాడు. ఆదివారం ఆయన దశదిన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి మండల సర్పంచులు హాజరై మృతుడు బాబురావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి సర్పంచుల మండల సంఘం తరఫున 20000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ప్రజా సేవ చేయాలని ద్రుడ సంకల్పంతో ప్రజల మన్నులతో సర్పంచ్ గా గెలిచినాడు. గెలిచిన అనత కాలానికి మరణించడం చాలా బాధాకరం, మనందరికీ తీరనిలోటని వారు పేర్కొన్నారు. వారి కుటుంబానికి మనందరం తోడుగా ఉండి కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల సర్పంచులు, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సవరించాలి

### – సిపిఎం డిమాండ్



**కారేపల్లి, మార్చి 22, ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తోంది ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను దగా చేసింది 2026,27 సంవత్సరానికి అసెంబ్లీలో మూడోసారి ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ 3,24,233 లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్లో శాఖల వారి కేటాయింపులు చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంకెల గారడి తప్ప ప్రజా సంక్షేమానికి ఏమాత్రం చిత్తశుద్ధి కనిపించట్లేదని సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు,ఆదివారం సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలో కే.నరేంద్ర అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు 6 గ్యారెంటీల హామీల అమలకు 50 వేల 713 కోట్ల రూపాయలు ఏమాత్రం సరిపోయేది కాదు తక్షణమే బడ్జెట్ నిసవరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు,భానోత్ బన్సీలాల్,దాసరి మల్లయ్య, తేజావత్ చందర్,దాసరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి



**నేలకొండపల్లి, మార్చి 22 ప్రజా జ్యోతి:** పాఠశాలలో ముందస్తు అడ్మిషన్ల పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు..ప్రవేట్ విద్యా సంస్థల పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యా సంవత్సరం ఇంకా పూర్తి కాకముందే జిల్లాలో కొన్ని ప్రవేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణ ను అరికట్టాలని కోరారు. ఫీజుల వివరాలు పాఠశాల ముందుర బోర్డు ను ఏర్పాటు చేయాలని కోరారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేట్ పాఠశాలల ' పై పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పోరుబాట చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలల తీరు పై జిల్లా కలెక్టర్. జిల్లా విద్యాశాఖాధికారి కి పిర్యాదు 'చేయనున్నట్లు తెలిపారు. వెంటనే ముందస్తు అడ్మిషన్ల పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు

### నాగులవంచ రైతు

# వేదికలో రైతు భరోసా సంబరాలు





**చింతకాని మార్చి 23ప్రజా జ్యోతి** రైతువేదికలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ఏర్పటు చేసిన తెలంగాణ రైతు బరోసా నిధుల విడుదల టెలి కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గున్నరు మత్కేపల్లి వ్యవసాయ మర్కెట్ కమిటి చైర్మన్ చింతకాని మండల కాంగ్రెస్ పార్టి అద్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు మరియు వ్యవసాయ అధికారులు డి ఎ ఓ డి. పుల్లయ్య ఎడిఎ ఎస్. విజయ్ చంద్ర ఎమ్ఎఓ : ఎస్. మనసా ఎఇఒ డి. కళ్యాణి, బి.కార్తిక్ ఈ సందర్భంగా అంబటి మాట్లడుతూ రాష్ట్రం పెద్ద మొత్తంలో ఆర్థిక లోటు ఉన్నపటికీ రైతున్నకు ఆర్థిక బరోసా కోసం ప్రబుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసింది అని .రైతు భరోసా నిధులు రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడతాయని, ౚతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు. వ్యవసాయ అధికారులు మాట్లాడతూ రైతులు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని తెలిపారు . ఈ సందర్బంగా రైతులు బాణసంచా కాల్చి రైతు భరోసా సంబరాలు నిర్వహించరు ఈ కార్యక్రమంలో జిల్ల అత్మ కమిటి మెంబర్ కొప్పుల గొవిందరావు , మండలంలో వివిద గ్రామల నాయకులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గున్నారు.

# విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డు అందుకున్న పెనుబల్లి యువకుడు



**సత్తుపల్లి మార్చి22(ప్రజా జ్యోతి)** పెనుబల్లి మండలానికి చెందిన బర్మావత్ మోతి కుమార్ (సన్ ఆఫ్ రంజా) అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకొని విశిష్ట గౌరవాన్ని అందుకున్నారు. పర్వత అధిరోహణలో తన ప్రతిభను నిరూపిస్తూ దక్షిణాఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో, రష్యాలోని మౌంట్ ఎల్బ్రూస్ వంటి ప్రముఖ శిఖరాలను విజయవంతంగా అధిరోహించినందుకు ఆయనకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డు ప్రదానం చేయబడింది. ఈ అవార్డు కార్యక్రమం విశాఖపట్నంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రతా బగ్చి (ఐపిఎస్ ), అలాగే రవిశంకర్ మలిశెట్టి (ఐఆర్ ఎస్), సినీ నటుడు రాజు కనకాల, డా. సత్య వోలు రాంబాబు (ఫౌండర్ అండ్ సిఈఓ, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్), ఎల్.ఎన్. తుమ్మడి రామ్ కుమార్, డా. కిషోర్ కుమార్, కస్టమ్స్ అధికారి సతీష్ సింగ్, రాపర్తి రాజా, కార్తీక్ తదితరులు హాజరై అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మోతి కుమార్ సాధనను ప్రశంసిస్తూ, యువతకు ఆయన ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఇక ప్రస్తుతం మోతి కుమార్ ప్రపంచంలోని అత్యున్నత శిఖరమైన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడానికి దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఎవరెస్టు శిఖరంపై భారత జాతీయ జెండాను ఎగరవేయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మహత్తర లక్ష్య సాధనకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం దాతలు, ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరుతున్నారు.మోతి కుమార్ లక్ష్యం నెరవేరి, ఎవరెస్టు శిఖరంపై జాతీయజెండాఎగరేయాలని స్థానికులు, అభిమానులు ఆశిస్తున్నారు. ఈ విజయంతో పెనుబల్లి మండలం,ఖమ్మంజిల్లాకు మరింత గౌరవం చేకూరనుంది.

# పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు

### సింగరేణి మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదానం







**కారేపల్లి,మార్చి 22,ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయ పల్లి గ్రామంలో వేంచేసి ఉన్న కోటమైసమ్మ తల్లి దేవాలయంలో వార్షికముగా నిర్వహించే పవిత్ర బ్రహ్మోత్సవాలుఆదివారంతో ముగిసాయి. ఆలయ ట్రస్ట్ చైర్మన్ పర్సాపట్టాభిరామారావు, ఈఓ కే. వేణుగోపాలచారి ఆధ్వర్యంలో ఆలయ పూజారి కొత్తలంక కైలాస శర్మ నేతృత్వంలో ఆదివారం ప్రాత:కాల మండప పూజలు, మహా పుష్పార్చన,మహా పూర్ణాహుతి, పవిత్రరోపనము, జయాది హోమము,అవబృత కలశ మార్జనములువంటి కార్యక్రమాలు బ్రహ్మశ్రీ కొడమంచిలి ఫణి కుమార్ శర్మ బృందంచే ఘనంగా జరిగాయి. సామూహిక కుంకుమ పూజలు,పూర్ణాహుతి కార్యక్రమం కన్నుల పండుగగా జరుగగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం సింగరేణి మర్చంట్స్ అసోసియేషన్ ఇల్లందు వారిచే మహా అన్నదాని కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.మూడు రోజులపాటు జరిగిన అమ్మవారి పవిత్ర బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని,ఆ తల్లి ఆశీస్సులు అనుగ్రహం పొందటం అటు భక్తులకు,పర్సా ట్రస్ట్ చైర్మన్ గా (పరస పట్టాభి రామారావు) తమకు పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని పట్టాభి, కార్యనిర్వహణ అధికారి కె.వేణుగోపాలాచార్యులు అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పరస సాయి,పగడాల మోహన్ కృష్ణ,సింగరేణి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు జుగల్ కిషోర్ ఖండేల్వాల్, సురేష్ తండేల్వాల్, తాటిపల్లి సుబ్బారావు,భువనగిరి రవి, గోపాల్ బట్టడ్, నారాయణదాసు లాహోటి, వినోద్ లాహోటి, శ్రీరంగం సుబ్బారావు, పసుమర్తి శ్రీనివాస్, అనిల్, కటకం అలేఖ్య, కటకం సత్యేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కొండెక్కిన కోడి

- భారీగా పెరిగిన ధరలు
- కిలో చికెన్ రూ. 320 పైనే
- ఎండలు పెరగడం, దిగుమతి తగ్గడమే కారణమా!
- సామాన్యుడి జేబుకు చిల్లు







**ఇల్లందు, మార్చి 22, ప్రజాజ్యోతి:** నాన్ వెజ్ ప్రియులకు భానుడు గట్టి షాకే ఇచ్చాడు. ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్క లేనిదే ముద్ద దిగని సగటు జీవికి ఇప్పుడు ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. మొన్నటి వరకు రూ. 270 నుండి రూ. 300 మధ్యలో ఊగిసలాడిన కిలో చికెన్ ధర ఇప్పుడు ఒక్కసారిగా రూ.320 మార్కును దాటేసింది. వేసవి ఎండల తీవ్రత పెరగడంతో కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడం, ఎండ దెబ్బకు ఫారాల్లో కోళ్లు మృత్యువాత పడటం, ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. సప్లై తక్కువగా ఉండటం, డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్యుడడి జేబుకు చిల్లు ఏడుతుంది. ప్రస్తుతం స్కిన్ లెస్ చికెన్ ధర కిలో రూ.340కి చేరింది. లైవ్ బర్డ్ ఫారాల వద్ద రూ. 200 పలుకుతుండగా, రిటైల్ రూ.320 వద్దకు చేరింది. పట్టణాల్లో ధరలు హైదరాబాద్ తో పోటీ పడుతూ రూ. 320 వద్ద ఉన్నాయి. విచిత్రమైన విషయం ఏంటంటే.. చికెన్ రేట్లు ఇంతగా పెరుగుతున్నా. గుడ్ల ధరలు మాత్రం కాస్త ఊరటనిస్తున్నాయి. ప్రస్తుతం నగరంలో డజను గుడ్లు రూ.64 కే లభిస్తున్నాయి. ఇక నాటు కోడి ప్రియుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. నాటుకోడి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో నాటుకోడి రూ.750 నుండి రూ.800 వరకు పలుకుతుంది. పండుగలు అయిపొయిన కానీ చికెన్ కు భారీగానే డిమాండ్ పెరిగింది. దీనికి తోడు ఎండల వల్ల కోళ్లు చనిపోతుండటంతో ఉత్పత్తిదారులకు తీరని నష్టం వాటిల్లుతుంది. గతేడాది సంక్రాంతి సమయంలో బాయిలర్ కోడి ధర రూ.340 చేరిన దాఖలాలున్నాయి. ప్రస్తుత ట్రెండ్ చూస్తుంటే మరో వారం రోజుల్లో చికెన్ ధర రూ.350 మార్కును సులువుగా దాటేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాబోయే రోజుల్లో ఎండలు మరింత ముదరనున్నాయి. ఇది పౌల్ట్రీ రంగానికి పెద్ద సవాల్ గా మారనుంది. ఎండ తీవ్రతను తట్టుకోలేక కోళ్లు చనిపోతుండటంతో యజమానులు బెంబేలెత్తిపోతున్నారు. ఉత్పత్తి తగ్గితే ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని, మే నెల నాటికి చికెన్ ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండకపోవచ్చని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆదివారం రోజున చికెన్ సెంటర్ల వద్ద జనం రద్దీ కనిపిస్తున్నా, పెరిగిన రేట్లు చూసి చాలామంది తక్కువ పరిమాణంలోనే కొనుగోలు చేస్తూ సరిపెట్టుకుంటున్నారు. చికెన్ ధరలు భారీగా పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఎండ వేడికి కోళు చనిపోతుండటం, కోళ్ల దిగుమతులు తగ్గడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తుంది. ఇల్లందు పట్టణంలో హోల్ సేల్ చికెన్ వ్యాపారులతో పాటు చిన్నచిన్న దుకాణదారులు వారం, పదిరోజులకు సరిపడా కోళ్లను కొని పెట్టుకొని చికెన్ విక్రయిస్తుంటారు. ఎండల బాగా ముదరడంతో వీరి దగ్గర ఉన్న కోళ్లు చనిపోతున్నట్లు తెలిసింది. దీంతో తమ వద్ద ఉన్న కోళ్లను రేట్లు పెం చి విక్రయాలు చేస్తున్నారని సమాచారం. మార్చి నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. రానున్న రెండు నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, తద్వారా చికెన్ ధరలు సైతం భారీగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కిలో చికెన్ రూ. 400 దాటే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇదే జరిగితే చికెన్ ప్రియు లకు బిగ్ షాక్ అని చెప్పొచ్చు.

# అవార్డు అందుకున్న గోచికొండ శ్రీదేవి




**ఇల్లందు టౌన్, మార్చి 22, ప్రజాజ్యోతి:** రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగిన పద్మశాలి ఉగాది పురస్కారాలలో ఆదివారం మహబూబాబాద్ యంపి పోరిక బలరాం నాయక్ మహిళా చేతుల మీదుగా పద్మశాలి సేవా అవార్డును కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి అందుకున్నారు. రాజకీయంగా, సామాజిక కార్యక్రమాలలో శ్రీదేవి చురుకుగా పాల్గొనడం, నిర్వహించడం వల్లనే అవార్డు రావడం జరిగిందని పద్మశాలి సంఘ నాయకులు తెలిపారు. గోచికొండ శ్రీదేవికి పద్మశాలి సంఘ ఉగాది పురస్కారాలలో పద్మశాలి సేవా అవార్డు అందుకోవడం పట్ల ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్, ఇల్లందు పద్మశాలి సంఘం నాయకులు, పట్టణ పుర ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.



### మానసిక దివ్యాంగుడిని

# అన్నం ఫౌండేషన్‌కు తరలింపు




**ఖమ్మం వైరా మార్చ్ 22 ప్రజా జ్యోతి** వైరా మండల పరిధిలోని స్టేజి పినపాక గ్రామం వద్ద గత కొద్దిరోజులుగా మానసిక స్థితి సరిగా లేకుండా తిరుగుతున్నటువంటి మానసిక దివ్యాశీగుడిని ఎస్సై పుష్పాల రామారావు గుర్తించి పోలీస్ స్టేషన్ కు తరలించారు భోజనం పెట్టించి అన్నం ఫౌండేషన్ కు సమాచారం ఇచ్చారు. ఆదివారం అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు కు అప్పగించినారు. మానసిక దివ్యాంగడి యొక్క భాషను బట్టి అతను తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

## రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రానున్న మూడు రోజుల వాతావరణ పరిస్థితులపై హైదరాబాద్ వాతావరణ కేంద్రం కీలక బులిటెన్ విడుదల చేసింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఆ తర్వాత ఎండల తీవ్రత పెరగనుందని వెల్లడించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారి తాజా విశ్లేషణ ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతలలో రాబోయే మార్పుల గురించి పూర్తి వివరాలు ఇక్కడ ఉన్నాయి. ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి తమిళనాడు, కర్ణాటక మీదుగా దక్షిణ అంతర్గత మహారాష్ట్ర వరకు సగటు సముద్ర మట్టం నుండి 0.9 కి.మీ ఎత్తులో ఒక ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. వర్షంతో పాటు గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వచ్చే రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు తగ్గి, పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. రానున్న రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీలు తక్కువగా నమోదై, వాతావరణం కాస్త చల్లగా ఉంటుంది. అయితే, ఇది తాత్కాలికమే. ఆ తర్వాతి నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. సగటున 2 నుండి 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉండటంతో ఎండల తీవ్రత మళ్ళీ మొదలవ్వనుంది.

ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బయట తిరగవద్దని, చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కోత దశలో ఉన్న పంటలను కాపాడుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎండలు పెరిగే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. అటు, ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కూడా కీలక ప్రకటన చేసింది. ఏపీ వ్యాప్తంగా ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో సోమవారం (23-03-26)శ్రీకాకుళం, విజయనగరం, మన్యం,అల్లూరి, పోలవరం,విశాఖ, అనకాపల్లి,కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు,కృష్ణా,ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అలాగే బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసేటపుడు పొలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని పేర్కొంది.ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదని సూచించింది.

## ఓటర్లకు కనీస సౌకర్యాలు ఉండాలి

### అసెంబ్లీ ఎన్నికల వేళ ఈసీ కీలక ప్రకటన

అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బంగాల్ శాసనసభ ఎన్నికలతో పాటు మరో ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ రోజున మొత్తం 2,18,807 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల కమిషనర్లకు (సీఈఓలకు) సూచించింది. ఈ మేరకు పత్రికా ప్రకటన రిలీజ్ చేసింది.పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఓటర్లు వేచి ఉండేందుకు ప్రదేశం, మరుగుదొడ్డి, తగినంత లైటింగ్, దివ్యాంగుల కోసం సరైన వాలుతో కూడిన ర్యాంప్, స్టాండర్ట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్, సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఈసీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల, యూటీల ఎన్నికల కమిషనర్లను ఆదేశించింది. అలాగే పోలింగ్ కేంద్రంలో వేచి ఉండేవారు కూర్చొనేందుకు బెంచీలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఓటర్లు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు, అలాగే వారి అవగాహన కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఒకే రకమైన నాలుగు ఓటరు సౌకర్యాల పోస్టర్‌లను ప్రదర్శించాలని కోరింది. ఈ పోస్టర్‌ల్లో పోలింగ్ కేంద్రం వివరాలు, అభ్యర్థుల జాబితా, అనుమతించే ఐడెంటిటీ ప్రూఫ్స్ జాబితా, ఓటింగ్ ప్రక్రియ వివరాలు ఉండాలని చెప్పింది. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు తమ పోలింగ్ బూత్ నంబరును, ఓటరు జాబితాలోని క్రమ సంఖ్యను కనుగొనడంలో సహాయపడటానికి బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓ)/వీఏబీ) అందుబాటులో ఉంటాలని సీఈఓ పేర్కొంది. ఓటర్లు పోలింగ్ ప్రాంగణానికి సమీపిస్తున్నప్పుడు వీఏబీలు ఓటర్లకు అవసరమైన సూచనలు, సహాయం చేయాలని సూచించింది. అలాగే పోలింగ్ స్టేషన్ ప్రవేశ ద్వారం వెలుపల ఓటర్ల




కోసం మొబైల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం కల్పించాలని స్పష్టం చేసింది. ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ముందు తమ ఫోన్‌ను (స్విచ్ఛాఫ్ చేసి) అక్కడి వాలంటీర్‌కు ఇచ్చి, ఓటేసిన తర్వాత మళ్లీ ఫోన్‌ను తీసుకోవచ్చని వెల్లడించింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలను కల్పించాలని ఆదేశించింది. ఓటర్లకు ఎలాంటి ఆటంకాలు లేని, ఆహ్లాదకరమైన ఓటింగ్ అనుభవాన్ని అందించేందుకు, పోలింగ్ తేదీలకు చాలా ముందుగానే అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించింది.అసోం, కేరళ, పుదుచ్చేరిలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని భారత ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారులు మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారని పేర్కొంది. ఈవీఎంలను వాటి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు కేటాయించే ప్రక్రియను రెండు దశల ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. కాగా, ఈవీఎం రాండమైజేషన్ అనేది ఈవీఎంలను ఏ నియోజకవర్గానికి, ఏ పోలింగ్ కేంద్రానికి కేటాయించాలో నిర్ణయించే ప్రక్రియ. ఇది రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశలో నియోజకవర్గాల వారీగా, రెండో దశలో పోలింగ్ కేంద్రాల వారీగా యంత్రాలను కేటాయిస్తారు. ఇది ఎన్నికల్లో పారదర్శకతను పెంచుతుంది. అందుకే సీఈసీ ఈవీలంల ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపడుతోంది.



# నాయకత్వంలో మార్పు చేసి చూడండి

మొదటిపేజీ తరువాయి..

2029లో కూడా ప్రజలు మాకే అవకాశం ఇస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని సిద్దిపేట జిల్లాలోని నర్మెట్టలో జరిగిన భారీ బహిరంగసభలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హరీష్ రావును వచ్చే ఎన్నికల్లో ఓడించేందుకు కాంగ్రెస్ నేతలు ఇప్పటినుంచే వ్యూహాలు రచిస్తున్నారు అనడానికి రేవంత్ మంత్రి పదవి ఆఫరే అందుకు నిదర్శనం. 'సిద్దిపేట ప్రాంతంలో 1984 నుంచి 2029 వరకు ఒకే కుటుంబం అధికారంలో ఉంది. కనుక ఈసారి ఇతరులకు కూడా ఒక అవకాశం ఇవ్వాలని నేను కోరుతున్నాను. నాయకత్వంలో మార్పు చేసి చూడండి. మీకు ఎంత మంచి జరుగుతుందో లేదో మీకే తెలుస్తుంది. ఈ ప్రాంత ప్రజలు చైతన్యవంతులు. కనుక వచ్చే ఎన్నికల్లో విచక్షణతో ఆలోచన చేయాలని కోరుతున్నాను
ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంటుంది. మల్లన్న సాగర్ సమస్య లేదా ఇతర సాగునీటి ప్రాజెక్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. గతంలో మల్లన్న సాగర్ సమయంలో ఏటిగడ్డ కిష్టాపూర్లో నేను 48 గంటల పాటు దీక్ష చేశాను. ఆనాడు రైతుల పక్షాన నిలబడటానికి దామోదర్ రాజనరసింహ, రఘునందన్ రావు కూడా వచ్చారని' తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం (మార్చి 22న) సిద్ధిపేట జిల్లా పర్యటనలో భాగంగా నంగునూరు మండలం నర్మెట్టలో రూ. 300 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన పామ్ ఆయిల్ కర్మాగారాన్ని ఆయన ప్రారంభించి, రాష్ట్ర రైతులకు అంకితం చేశారు. దీనికి అదనంగా రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా నిధులను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ. 775.72 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన మంత్రులతో కలిసి శ్రీకారం చుట్టారు. సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో విద్యా, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ రేవంత్ రెడ్డి పలు కీలక భవనాలను ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా రూ. 141.34 కోట్లతో సిద్దిపేట మున్సిపాలిటీలో చేపట్టిన నీటి సరఫరా మరియు భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులు ఉన్నాయి.

అలాగే ఎన్సాన్‌పల్లిలో రూ. 78 కోట్లతో నిర్మించిన జిల్లా జైలు భవనం, రూ. 15 కోట్లతో ఏర్పాటు



చేసిన 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రిని ఆయన జాతికి అంకితం చేశారు. ఇవే కాకుండా సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌తో పాటు నంగునూరు, అంబేద్కర్ నగర్‌లలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను కూడా సీఎం ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ రైతులను ఆదర్శంగా తీసుకొని రైతులంతా ముందుకెళ్లాలని రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణలో ఒక్కో జిల్లా ఒక్కో పంటకు ప్రసిద్ధి అని, తెలంగాణ రాష్ట్రంలో సారవంతమైన భూములున్నాయని, కష్టపడే రైతులు ఉన్నారని తెలిపారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని నిర్ణయించామని, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నామని, ఒకప్పుడు సౌర విద్యుత్ వ్యాపారం అంబానీ, అదానీ వంటివారు చేసేవారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం మహిళలతో సోలార్‌ప్లాంట్లను ఏర్పాటు చేయించిందని, ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం టిఫిన్ కూడా

పెడుతున్నామని వివరించారు.ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా రైతుల విషయంలో వెనుకంజ వేయటం లేదన్న సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక సమస్యలు అభివృద్ధికి అవరోధంగా మారాయని అన్నారు.ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. రైతు భరోసా నిధులను మొత్తం 3 విడతల్లో పూర్తి చేస్తామని, 45 రోజుల్లో 3విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు వేయనున్నామని, రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి, రుణమాఫీ కూడా చేశామని తెలిపారు. వరికి బోనస్ ఇస్తున్నామని, వరదల వల్ల నష్టపోతే పరిహారం ఇస్తున్నామని, రైతుల కోసం ఇప్పటివరకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలి. సిద్దిపేట నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తా. గత పాలకులు ప్రతిపక్ష నేతల నియోజకవర్గాల పట్ల వివక్ష చూపించారు. నేను నేతలతో వ్యతిరేకిస్తాను గానీ ప్రజల పట్ల వివక్ష చూపను. సిద్దిపేటకు కూడా నిధులు భారీగా ఇచ్చాను. వివక్ష చూపే వ్యక్తినే అయితే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కొడంగల్‌కు తీసుకెళ్లేవాడిని. ప్రజలు రెండుసార్లు మీకు అధికారం ఇచ్చారు. రెండుసార్లు మాకు ఇస్తారని అన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల

మొదటిపేజీ తరువాయి..

భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రుల సమక్షంలో సీఎం ఈ నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా రైతుల విషయంలో వెనకంజ వేయటం లేదని పేర్కొన్నారు. ఆర్థిక సమస్యలు అభివృద్ధికి అవరోధంగా మారాయని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా, రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా నిధులను మొత్తం 3 విడతల్లో పూర్తి చేస్తామని, 45 రోజుల్లో 3 విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు వేయనున్నామని వెల్లడించారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి, రుణమాఫీ కూడా చేశామని గుర్తు చేసిన సీఎం, వరికి బోనస్ ఇస్తున్నామని, వరదల వల్ల నష్టపోతే పరిహారం ఇస్తున్నామని వివరించారు.

రైతుల కోసం ఇప్పటివరకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. తెలంగాణ ప్రాంతం నిజాం కాలంలోనే వాణిజ్య పంటలకు ప్రసిద్ధిగా ఉండేదని గుర్తు చేసిన సీఎం, రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలని పిలుపునిచ్చారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు బాగా పండించే వారని, రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల రంగారెడ్డి జిల్లా పంటల సాగు తగ్గిందన్నారు. ఫలితంగా కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే కేంద్రం 50 లక్షల టన్నుల వరి మాత్రమే కొంటామని చెప్తోందన్న ఆయన, పంట మార్పిడి ద్వారా మాత్రమే వ్యవసాయం లాభసాటి అవుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 73 లక్షల మంది రైతులున్నారు. వీరందరికీ తొలి విడతలో ఒక ఎకరం వరకు సాయం అందించనున్నారు. దీనికోసం రూ.3,590 కోట్లు ఆదివారం ఆర్బీఐ ద్వారా బ్యాంకులకు, అటు నుంచి రైతులకు చేరవేయనున్నారు. అయితే ఆదివారం సెలవు కావడంతో ఈ నిధులు సోమవారం అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో



జమవుతాయి. రెండో విడతగా ఇరవై రోజుల అనంతరం రూ.2,650 కోట్లు, తర్వాత మూడో విడతగా రూ.2,760 కోట్లు విడుదల చేయనున్నారు. తెలంగాణలోని మొత్తం రైతుల్లో 24.32 లక్షల మందికి ఎకరం వరకు వ్యవసాయ భూమి ఉంది. మిగిలిన 48.68 లక్షల మందికి ఎకరం కంటే ఎక్కువ వ్యవసాయ భూములు ఉన్నాయి.పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం రాష్ట్రంలో అధిక కొరత, డిమాండ్ ఉన్న పంటలకు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఆదివారం నర్మెటలో జరిగే రైతు ఉత్సవాల్లో కొత్త పంటలకు బోనస్‌పై విధాన నిర్ణయం ప్రకటించే అవకాశమున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రెండు సీజన్లలో 30 రకాల పంటలను పండిస్తున్నారు. వీటిని 2.14 కోట్ల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో 1.28 కోట్ల ఎకరాల్లో వరి, 50 లక్షల ఎకరాల్లో పత్తి ప్రధాన పంటలుగా వేస్తున్నారు. తర్వాత స్థానాల్లో మొక్కజొన్న, కందులు, సోయాబీన్ ఉన్నాయి.ప్రభుత్వం రెండేళ్లుగా సన్నవడ్లకు ప్రోత్సాహకం అందజేస్తోంది. దీనికోసం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తోంది. దీనికి 2025-26 బడ్జెట్‌లో రూ.1,800 కోట్లు కేటాయించింది. ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర నూనె గింజలు, మొక్కజొన్న, పసుపు, పప్పు ధాన్యాలు, వేరు శనగ పంటలకు సైతం బోనస్ ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్లు పెరగడంతో ప్రభుత్వం దానిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే 2026-27 బడ్జెట్‌లో పంటల బోనస్‌కు మొత్తంగా రూ.3,500 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది.

## భారత్ ఫార్మా రంగంలో సరికొత్త విప్లవం!

మొదటిపేజీ తరువాయి..

ఫార్మా, సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను రెండు వేర్వేరు బ్రాండ్ల పేరుతో విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. టైప్-2 మధుమేహం నియంత్రణ కోసం సెమాట్రినిటి దీర్ఘకాలిక బరువు నిర్వహణ కోసం నావల్‌ట్రీట్ బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది..అంతర్జాతీయ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వేగోవీ, ఓజెంపిక్ వంటి బ్రాండ్లతో పోలిస్తే, సన్ ఫార్మా అందిస్తున్న ఈ ఔషధాల ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. నోవో నార్డిస్క్ సంస్థ చందిన వేగోవీ ధర వారానికి 2,700 నుంచి 4100 మధ్య ఉండగా, ఓజెంపి◌ నెలవారి ఖర్చు 8, 800 నుంచి 11, 175 వరకు ఉంటుంది. దీనికి భిన్నంగా సన్ ఫార్మా ప్రకటించిన ధరల వివరాలు చూస్తే షాకింగ్‌గా ఉన్నాయి. నావెల్‌ట్రీట్ వారానికి 900 నుంచి 2వేల వరకు ఖర్చు అవుతుంది. డోసేజీని బట్టి మారుతుంది. సెమాట్రినిటీ వారానికి 750 నుంచి 1300 మధ్య ధర ఉండొచ్చు. ఇన్నోవేటర్ బ్రాండ్ల ధరతో పోలిస్తే ఇది సగానికిపైగా తక్కువ కావడంతో , మధ్య తరగతి రోగులకు ఈ అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చినట్టైంది. మరోవైపు అహ్మదాబాద్‌కు చెందిన జెడస్ లైఫ్ సైన్సెస్ కూడా సెమాగ్లుటైడ రంగంలోకి ప్రవేశించింది. సెమాగ్లిన్, మాషెమా, అల్టర్‌మె అనే పేర్లతో ఈ ఇంజెక్షన్‌లను సంస్థ విడుదల చేసింది. టైప్ - డయాబెటిస్, ఊబకాయం చికిత్స కోసం ఈ ఔషధాలకు నియంత్రణ సంస్థల ఆమోదం లభించింది. జైడస్ సంస్థ ఒక వినూత్నమైన మార్పును తీసుకొచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న అనే సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లు సింగిల్ డోస్‌పెన్ రూపంలో ఉంటాయి. అంటే ప్రతిసారి కొత్త పెన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కాని జైడస్ సంస్థ రీయూజబుల్ మల్టీ డోస్ పెన్ పరికరాన్ని పరిచయం చేసింది. రీయూజబుల్ మల్టీ డోస్ పెన్ వల్ల రోగులు ఒకే పన్నును ఉపయోగించి వైద్యుల సూచన మేరకు వేర్వేరు డోస్‌లు తీసుకోవచ్చు. ప్రతిసారి పెన కొనే అవసరం లేకపోవడంతో చికిత్స ఖర్చు తగ్గుతుంది. రోగులు క్రమం తప్పకుండా ఔషధాన్ని తీసుకోవడానికి ఇది ఎంతో తోడ్పడుతుంది.

## నాచారం హెచ్‌ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా బి. బుచ్చయ్య... ప్రధాన కార్యదర్శిగా జి.రామ కోటేశ్వర రావు

ఉప్పల్, మార్చి 22: నాచారం హెచ్‌ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నాచారం హెచ్‌ఎంటి లో నిర్వహించారు. హెచ్‌ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా బి. బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా జి. రామకోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఆర్. యాదగిరిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి. సామ్రాట్, కోశాధికారిగా రామారావు గెలుపొందారు. అదేవిధంగా సభ్యులుగా వి. బాల్ రెడ్డి, పి నరసింహారెడ్డి, ఎండి యూసుఫ్, బి.హెచ్. నారాయణ బాబు, సతీష్ కులకర్ణి తదితరులు ఎన్నికల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా బుచ్చయ్య, రామకోటేశ్వరరావు, యాదగిరి రెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఎంటి నగర్ లో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న దోమల సమస్య నివారణకు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రభుత్వం ద్వారా పోరాడి రూ. 30 కోట్లను మంజూరు చేయించడం జరగడం హెచ్‌ఎంటి నగర్ ప్రజలకు శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్యే సహకారం స్థానికుల సహకారంతో హెచ్‌ఎంటి నగర్ లో దోమల సమస్య లేకుండా తాము నిరంతరం పనిచేస్తామని వెల్లడించారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967